


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 28 నవంబరు 2021 సంపుటి : 03 సంచిక : 97 పేజీలు : 4 వెల : రూ 3-00


## ఒమైక్రాన్‌పై యుద్ధానికి ఫ్పైజర్ సిద్ధం




న్యూఢిల్లీ : దక్షిణాఫ్రికాలో కనిపించిన కోవిడ్-19 వైరస్ కొత్త స్ట్రెయిన్‌కు సుమారు 100 రోజుల్లో వ్యాక్సిన్‌ను ఉత్పత్తి చేస్తామని ఫ్పైజర్ ప్రకటించింది. ప్రస్తుతం తాము తయారు చేస్తున్న వ్యాక్సిన్ ఈ కొత్త వైరస్ స్ట్రెయిన్‌ను కట్టడి చేసేందుకు పనికొస్తుందో, లేదో తమ పరిశోధకులు పరీక్షలు చేస్తున్నారని తెలిపింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఈ కొత్త స్ట్రెయిన్‌కు 'ఒమైక్రాన్' అని పేరు పెట్టింది. ఫ్పైజర్ శుక్రవారం మీడియాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం, దక్షిణాఫ్రికాలో కనిపించిన కోవిడ్-19 వైరస్ కొత్త స్ట్రెయిన్‌కు సుమారు 100 రోజుల్లో వ్యాక్సిన్‌ను ఉత్పత్తి చేసేందుకు ఫ్పైజర్, తన జర్మన్ భాగస్వామి బయోఎన్‌టెక్‌తో కలిసి కృషి చేస్తుంది. ప్రస్తుత వ్యాక్సిన్ సమర్థవంతంగా పని చేయకపోతే, కొత్తగా ఓ వ్యాక్సిన్‌ను అభివృద్ధిపరుస్తారు. ప్రస్తుతం జరుగుతున్న పరీక్షల ఫలితాలు రెండు వారాల్లోగా అందుతాయని ఫ్పైజర్ భావిస్తోంది.అమెరికాలో కొత్త వ్యాక్సిన్‌ను ప్రజలకు ఇవ్వాలంటే ప్రభుత్వ అనుమతి అవసరమవుతుంది. అత్యవసర వినియోగం కోసం ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అనుమతి ఇవ్వాలి. ఒమైక్రాన్ వ్యాప్తిని ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా అమెరికా ఆరోగ్యం, మానవ సేవల శాఖ కార్యదర్శి ప్రకటించవలసి ఉంటుంది. ఫ్పైజర్, బయోఎన్‌టెక్ ప్రస్తుత వ్యాక్సిన్‌కు అనుమతి పొందడానికి దాదాపు 9 నెలల సమయం పట్టింది. గతంలో కనిపించిన వైరస్ స్ట్రెయిన్స్ కన్నా ఒమైక్రాన్‌కు ఎక్కువ రూపాంతరాలు ఉన్నట్లు దక్షిణాఫ్రికా ఆరోగ్య శాఖాధికారులు తెలిపారు. ఈ కొత్త వేరియంట్‌కు వ్యాపించే లక్షణం ఎక్కువగా ఉందన్నారు.

### కరోనా కొత్త వేరియంట్ కలకలం..

# ప్రధాని మోదీ కీలక ప్రకటన



న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్-19 పరిస్థితి, వ్యాక్సినేషన్ కార్యక్రమంపై శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమీక్ష నిర్వహించారు. ఒమిక్రాన్ వేరియంట్ వ్యాప్తి నేపథ్యంలో అంతర్జాతీయ ప్రయాణాలపై ఆంక్షలను సడలించే ప్రణాళికలను సమీక్షించాలని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం అధికారులను కోరారు.కొత్త వేరియంట్‌కు సంబంధించిన పరిణామాలపై క్లుప్తంగా, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ద్వారా 'ప్రమాదంలో' ఉన్న దేశాల నుంచి వచ్చే వారిపై ప్రత్యేక దృష్టి సారించి, అంతర్జాతీయంగా వచ్చిన వారందరినీ పర్యవేక్షించాల్సిన అవసరాన్ని ప్రధాని నొక్కి చెప్పారు. వీటితో పాటు ముఖానికి మాస్క్ ధరించడం, క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం, సామాజిక దూరాన్ని కొనసాగించడం వంటి కోవిడ్ ప్రోటోకాల్స్‌ను తప్పకుండా పాటించాలని ప్రధాని మోదీ సూచించారు. వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని.. ప్రతి ఒక్కరు విధిగా వ్యాక్సిన్ రెండు డోసులు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశానికి కేబినెట్ సెక్రటరీ రాజీవ్ గౌబా, ప్రధాని ముఖ్య కార్యదర్శి పీకే మిశ్రా, కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి రాజేశ్ భూషణ్, నీతి ఆయోగ్ సభ్యులు (ఆరోగ్యం) డా. వీకే పాల్ హాజరుకానున్నారు. దక్షిణాఫ్రికాలో వైరస్ కొత్త వేరియంట్ ఒమిక్రాన్ విస్తరిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ ప్రయాణికులను క్షుణ్ణంగా పరీక్షడంతో పాటు దేశంలో వైరస్ వ్యాప్తిని అడ్డుకనేందుకు తగిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు. కొత్త వేరియంట్లపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సౌతాఫ్రికాలో వెలుగు చూసిన కరోనా వేరియంట్ అత్యంత ప్రమాదకరమైందని డబ్ల్యూహెచ్‌ఓ హెచ్చరించిన నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఇప్పటికే కొన్ని దేశాలు వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు విమానాల రాకపోకను నిషేధించాయి. ముందస్తు చర్యల్లో భాగంగా దక్షిణాఫ్రికా, జింబాబ్వే సహా 7 దేశాలపై అమెరికా ప్రయాణ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే.

## చంద్రబాబు ఏడ్చినంత మాత్రాన సానుభూతి రాదు: ఉండవల్లి

తూర్పుగోదావరి: భార్య పేరుతో ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఏడుస్తున్న ఏడుపునకు సానుభూతి రాదని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ స్పష్టం చేశారు. అసెంబ్లీలో జరగని ఘటనకు ఎన్ని వ్యాఖ్యానాలు జోడించినా ప్రజలు నమ్మరని ఉండవల్లి తెలిపారు. ఆయన శనివారం రాజమండ్రిలో మీడియాతో మాట్లాడుతూ..చంద్రబాబు నాయుడు మీడియా ముందు ఏడిస్తే అందుకు సానుభూతి ఏమీ రాదన్నారు.వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎటువంటి సంబంధం లేదన్న ఉండవల్లి.. ఈ ఘటన తర్వాత సీబీఐ విచారణ కోరింది సీఎం వైఎస్ జగన్ అని గుర్తుచేశారు. అసెంబ్లీలో వైఎస్ వివేకానందరెడ్డి మృతిపై మాట్లాడటం తప్పని ఉండవల్లి తెలిపారు.



## ఏపీలో కొత్తగా 26 జిల్లాలు?



అమరావతి: జిల్లాల పునర్విభజన ప్రక్రియ ప్రారంభించాలంటూ ఉన్నతాధికారులకు సీఎం జగన్ ఆదేశాలిచ్చారు. జనగణన పూర్తయ్యేలోగా విభజనకు సంబంధించి.. ప్రాథమిక ప్రక్రియ పూర్తి చేసి నోటిఫికేషన్‌కు సిద్ధం కావాలని ఆదేశించారు. జనగణన ఉన్నప్పుడు ప్రక్రియను చేపట్టడం సరికాదని అధికారులు సూచించినట్లు సమాచారం. ఈలోగా ప్రాథమిక కసరత్తు, ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని ఆదేశాలిచ్చారు. ఏపీలోని 13 జిల్లాలను 26 జిల్లాలుగా ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక జిల్లాగా ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో వైసీపీ ప్రకటించింది. అరకు పార్లమెంటును రెండు జిల్లాలగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో సమస్యలను పక్కదారి పట్టించేందుకే ఈ ఎత్తుగడ వేస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

## ఏపీలో ఆర్థిక విధ్వంసం, విస్ఫోటనం జరుగుతుంది: రఘురామ



ఢిల్లీ: ఏపీలో ఆర్థిక విధ్వంసం, విస్ఫోటనం జరుగుతుందని ఎంపీ రఘురామకృష్ణరాజు ఆక్షేపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మద్యంపై వచ్చే ఆదాయాన్ని చూపించి అప్పు తెస్తున్నారని తప్పుబట్టారు. దేశంలో ఇంతలా అప్పులు చేస్తున్న రాష్ట్రం ఏపీ తప్ప మరొకటి లేదన్నారు. ఆర్థిక విధ్వంసంపై ప్రధాని, ఆర్బీఐ బ్యాంక్‌లకు లేఖలు రాస్తానని తెలిపారు. కార్పొరేషన్ ద్వారా అప్పులు ఇచ్చి ప్రజలను బలిపశువులు చేయొద్దని సూచించారు. ఎఫ్‌ఆర్‌బీఎం పరిధి మేరకు మాత్రమే అప్పులు ఇవ్వాలన్నారు. కాగ్ సహితం అప్పులపై తలలు పట్టుకొని ఏపీని వదిలేసే పరిస్థితి వచ్చిందని రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు.

## న్యాక్‌లో కన్‌స్ట్రక్షన్ యూనివర్సిటీ ఏర్పాటుకు త్రిసభ్య కమిటీ

హైదరాబాద్ : హైటెక్ సిటీలోని న్యాక్( నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్)లో కన్‌స్ట్రక్షన్ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. యూనివర్సిటీ ఏర్పాటు విషయంలో ఇప్పటికే త్రిసభ్య కమిటీ వేశామని, ఆ నివేదిక రాగానే వర్సిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.శనివారం నిర్వహించిన న్యాక్ 42వ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాక్‌లో పలు బ్లాక్‌లను మంత్రి స్వయంగా పరిశీలించారు. న్యాక్ లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల అనుభవాలను ప్రశాంత్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. వారికి కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యార్థులకు న్యాక్ కల్పిస్తున్న ఉద్యోగ నియామకాలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం మంత్రి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు న్యాక్ అనే సంస్థ స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. కొవిడ్ సమయంలోనూ న్యాక్ పని చేసిందని గుర్తు చేశారు. గతేడాది 19 వేల మందికి శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు.

## ఆస్తి కోసం బిడ్డలు ఇబ్బంది పెడుతున్నారయ్యా..

### బాధితుల సమస్యలు ఆలకిస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్
### ఎస్పీ ఎదుట వృద్ధురాలి వేదన



కోనేరు సెంటర్: జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం జరిగిన ప్రతి రోజు స్పందనలో ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన బాధితుల నుంచి అర్జీలు అందుకున్నారు. సమస్య ఎలాటిదైనా చట్టపరిధిలో పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రతి రోజు స్పందనలో ప్రజా సమస్యలకు పరిష్కారం దొరుకుతుండటంతో బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.ఆస్తి కోసం బిడ్డలు ఇబ్బంది పెడుతున్నారంటూ వృద్ధులు, అధికకట్నం కోసం అత్తింటి వేధింపులు అధికం అయ్యాయంటూ వివాహితులు, ఉద్యోగం పేరిట మోసం చేశారంటూ నిరుద్యోగులు, ప్రేమ పేరుతో వంచన చేశారంటూ అమాయపు ఆడపిల్లలు ఇలా అనేక మంది ఫిర్యాదులు చేసేందుకు ఎస్పీ కార్యాలయంలో బారులు తీరుతున్నారు. ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ అదే స్థాయిలో స్పందిస్తూ సమస్యలు పరిష్కరిస్తుండటంతో బాధితులు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.శనివారం జరిగిన ప్రతి రోజు స్పందనలో దాదాపు 25 మందికిపై బాధితులు ఎస్పీని కలిసి తమ తమ సమస్యలు చెప్పుకుని న్యాయం కోరారు. స్పందించిన ఎస్పీ బాధతులకు తప్పకుండా న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. గూడూరు మండలం పోలవరం గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు ఎస్పీని కలిసి తన ఇద్దరు కుమారులు ఆస్తి కోసం తనను అనేక అవస్థలు పెడుతున్నారని వారిపై చర్యలు తీసుకుని తనకు రక్షణ కల్పించాలని వేడుకుంది. అలాగే కోడూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తాను వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తుంటానని సరిహద్దుదారుడు తన పొలంలో పురుగుమందు పిచికారీ చేసే క్రమంలో తన పంట మొత్తం నాశనం అయిందని అదేమని అడిగితే తనపై దాడి చేసి కొట్టాడని అతనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఎస్పీ ఫిర్యాదులన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి పరిష్కరిస్తానని బాధితులకు హామీ ఇచ్చారు.

## ఏపీపై కేంద్రం సీరియస్

ఢిల్లీ: ఏపీ ప్రభుత్వంపై కేంద్రప్రభుత్వం మరోసారి సీరియస్ అయింది. ఎంపీ లాడ్స్ నిధుల దుర్వినియోగంపై ఏపీ ప్రభుత్వం కేంద్రానిక సమాధానం ఇవ్వలేదు. ఎంపీ లాడ్స్ నిధులను చర్చిల నిర్మాణం కోసం ఖర్చు చేయడంపై వెంటనే నివేదిక పంపాలని ఏపీని కేంద్రం ఆదేశించింది. ప్రధాని కార్యాలయానికి నివేదిక ఇవ్వాల్సి ఉన్నందున తక్షణమే నివేదిక పంపాలని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శికి విడివిడిగా కేంద్ర గణాంకాలు, ప్రణాళికా మంత్రిత్వ శాఖ లేఖలు పంపింది.ఏపీకి చెందిన ఎంపీ నందిగం సురేష్ ఒక చర్చి నిర్మాణానికి రు.40 లక్షలకుపైగా నిధులు ఇచ్చినట్లు మీడియాలో వచ్చిన కథనాలతో ప్రధాని మోదీకి ఎంపీ రఘురామకృష్ణ రాజు లేఖ రాశారు. రఘురామ రాసిన లేఖపై నివేదిక అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి రెండు నెలల క్రితం గణాంకాలు, ప్రణాళిక శాఖ లేఖ పంపింది. అప్పటి నుంచి స్పందించక పోవడంతో ఏపీ సీఎస్‌కు గుర్తు చేస్తూ గణాంకాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమ్య మరో లేఖ పంపారు.

## 'చంద్రబాబు ఏడుపులు.. ఆ విషయం ఎన్టీఆర్ ఎప్పుడో చెప్పారు'

### గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ



విజయవాడ: చంద్రబాబు ఏడుపు రాజకీయాలు పని చేయవని.. ఆయన ఎందుకు ఏడుస్తున్నాడో తనకు అర్థం కావడం లేదని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఎద్దేవా చేశారు. చంద్రబాబు తన కంటే నటుడని ఎన్టీఆర్ ఎప్పుడో చెప్పారని, వరద బాధితుల దగ్గరకు వెళ్లి నన్ను ఓదార్చండి అని అడగటం ఏంటి?. ఇంతకంటే నీచ రాజకీయం ఉంటుందా? అంటూ వంశీ దుయ్యబట్టారు."కుప్పం ఓటమి ప్రభావం ఆయన మీద బాగా పనిచేస్తోంది. కొడుకు ప్రయోజకుడు అవుతాడనుకుంటే ఉత్తర కుమారుడయ్యాడు. ఇక అధికారం వస్తుందన్న నమ్మకమూ లేదు. ఇవన్నీ చంద్రబాబును బాగా ఫ్రస్టేషన్‌లోకి తీసుకెళ్లాయి. అందుకే ఏది పడితే అది మాట్లాడుతున్నారు. అప్పట్లో అలిపిరి ఘటనను అడ్డుపెట్టుకుని ఎన్నికలకు వెళ్తే ఏం జరిగిందో చూశాం. ఇప్పుడు ఏడుపు రాజకీయంతో ఎన్నికలకు వెళ్లినా అంతే.. ప్రజలకు వాస్తవాలు తెలుసు. తగిన సమయంలో తగిన రీతిలో బుద్ధి చెబుతారని" ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అన్నారు.

## కొవిడ్ కొత్త వేరియంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం

హైదరాబాద్ : కొవిడ్ కొత్త వేరియంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం అయింది. ఈ నేపథ్యంలో ఈ నెల 28న వైద్యారోగ్య శాఖ అధికారులతో మంత్రి హరీశ్‌రావు సమావేశం కానున్నారు. కరోనా కొత్త వేరియంట్ విజృంభిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ ప్రయాణికుల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. కొత్త వేరియంట్ విజృంభించిన దేశాల నుంచి రాకపోకలపై చర్చించి కీలక నిర్ణయం తీసుకోనున్నారు. అంతర్జాతీయ ప్రయాణికులపై ఇప్పటికే రాష్ట్రాలను కేంద్రం అప్రమత్తం చేసిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ ప్రయాణికుల ట్రేసింగ్, టెస్టింగ్‌పై మంత్రి హరీశ్‌రావు వైద్యారోగ్య శాఖ అధికారులతో చర్చించి, పలు సూచనలు చేయనున్నారు.



# సంపాదకీయం

ఆదివారం 28 నవంబరు 2021

## రైతన్నలతో రాజకీయ క్రీడ..

రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా ధాన్యం కొనుగోలు, యాసంగి వరి పంటపైన తీవ్ర చర్చ జరుగుతుంది. అసలు వరిపంట కొనుగోలుపై ఎప్పుడు రానీ కష్టం.. ఇప్పుడేందుకు వచ్చింది. ఈ విషయం పై ప్రతిపక్ష పార్టీలు అధికార పక్షాన్ని విమర్శిస్తుంటే, అధికార టీఆర్ఎస్ మాత్రం నెపాన్ని కేంద్రం మీద తోస్తుంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. దీనిపై రాజకీయాలు ఎలా ఉన్న చివరికి నష్ట పోయేది మాత్రం సగటు రైతన్నలే.. కేంద్రం దీనిపై ఏం చెబుతుంది రా రైస్ మాత్రమే తీసుకుంటామని, కానీ తెలంగాణలో రా రైస్ కన్నా ఉప్పుడు బియ్యం ఎక్కువగా పండుతుంది. దీనిపై రైతన్నలు ఆగ మాగం అవుతున్నారు. మరో వైపు రి కొనుగోళ్ల వ్యవహారం ఇప్పటికే తెలంగాణ సర్కార్, కేంద్రం మధ్య నిప్పు రాజేసింది.. మార్కెట్ యార్డులతో పాటు.. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వరి ధాన్యం దర్శనమిస్తోంది.. దయచేసి మా ధాన్యాన్ని కొనుగోలు చేయండి మొర్రో అంటూ రైతులు వేడుకున్నా ఫలితం దక్కని పరిస్థితి ఉంది.. ఈ తరుణంలో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి వరి ధాన్యాన్ని తరలిస్తున్నారు..అయితే, రాష్ట్ర సరిహద్దుల్లో ఆ లారీలను అడ్డుకున్నారు తెలంగాణ అధికారులు.. గద్వాల జిల్లాలోని ఏపీ–తెలంగాణ బోర్డర్‌లోని పుల్లూరు లోట్ గేట్ వద్ద.. ఏపీ నుంచి వరి ధాన్యం లోడ్‌తో వస్తున్న లారీలను నిలిపివేశారు. దీంతో.. రాష్ట్ర సరిహద్దులో వరి ధాన్యానికి బ్రేక్‌లు పడినట్టు అయ్యింది.. ఏపీలోని వివిధ ప్రాంతాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేసిన వ్యాపారులు.. రాష్ట్రంలోకి తీసుకొస్తున్న తరుణంలో అధికారులు అడ్డుకున్నారు.. తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల జాప్యం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా చెబుతున్నారు.వానకాలం పంటలో ప్రస్తుతం కల్లాలో ఉన్నవి రా రైస్ అయినా కూడా కేంద్రం దీనిపై స్పష్టత ఇవ్వడం లేదు. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రాధినేతలకు ఎంత ధాన్యం కల్లాలో ఉందో స్పష్టత లేదు.గతంలో రాష్ట్ర సీఎం చేసిన ప్రకటనలు ఇప్పుడు రైతన్నలను ఆగం చేశాయి. ఒకసారి ఎంతైనా ధాన్యం కొంటామని చెప్పారు. మరోసారి వరివస్తే ఉరే అంటూ ప్రకటనలు చేశారు. దీంతో సాక్షాత్తూ రాష్ట్ర సీఎం ఇలాంటి ప్రకటనలు ఇవ్వడంతో తెలంగాణ రైతుల్లో భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. ఒక సందర్భంలో తెలంగాణలో పంటలు పండించేందుకు తగినంత నీరు లేకపోయింది. కేవలం నీరు తక్కువ గా ఉండే మెట్ట పంటలు మాత్రమే వేయాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం తెలంగాణ సర్కార్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, ఎస్సారెస్పీ కాలువల ను చెరువులకు అనుసంధానం చేయడంతో పుష్కలంగా నీరు ఉంది. నీరు ఎక్కువగా ఉన్నప్పుడు మెట్ట పంటలు వేస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారు. కాబట్టి దీనికి అనుగుణంగా వరి మాత్రమే వేయగలరు. పైగా తెలంగాణ నేలలో వరి మాత్రమే ఎక్కువగా పండుతుంది.ఈ విషయలేవీ రాష్ట్ర సర్కార్‌కు తెలియదా అంటే సమాధానం చెప్ప డం కష్టమే.. ఇప్పుడు వరి వేయ్యొద్దని రైతన్నలను ఆగం పట్టిస్తు న్నారు. మాట మాట్లాడితే కేంద్రం ధాన్యం కొనడం లేదు అనే సమా ధానం తప్ప ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడం లేదు రాష్ట్ర ప్రభుత్వం. మిల్లర్ల తో సమావేశం నిర్వహించి రైతులు పండించే ధాన్యం కొనుగోలు పై చర్చించి మార్కెట్‌లోకి తీసుకునే అవకాశం ఉన్న ఆదిశగా ప్రభుత్వం అడుగులు వేయడం లేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు వ్యవసాయ శాఖ కూడా దీనిపై స్పందించడం లేదు. పంటలు వేసే ముందే రైతులను అప్ర మత్తం చేయాల్సి ఉన్నా ఆ దిశగా వ్యవసాయ శాఖ అడుగులు వేస్తున్నట్టు కనిపించడం లేదు.రైతన్నలు ఇప్పటికే యాసంగి వరి పంట వేయాలా వద్దా అన్న ఆలోచనలో ఉంటే ఆయా పార్టీల నేతలు మాత్రం రైతన్నలను అడ్డం పెట్టుకుని తమదైన రాజకీయ క్రీడను మొదలు పెట్టారు. ముందుగా అధికార పార్టీ తనవైపు ఏం తప్పు లేదని ఆ నెపాన్ని కేంద్రం పై నెట్టి వేసింది. మరోవైపు ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ అధికార పార్టీలు తప్పంతా తెలంగాణ సర్కార్‌దేనంటూ విమర్శల బాణాలు వదులుతున్నారు. ఈ విషయంలో బీజేపీ నేతలు ఒక్క అడుగు ముందుకేసి మరీ కేంద్రం తప్పేమి లేదని వాదిస్తున్నారు. ఇప్పటికే కల్లాలో ధాన్యం అలాగే ఉం ది రాష్ట్ర వ్యాప్తంగా 8వేలకు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పా టు చేయాల్సి ఉన్నా ప్రభుత్వం 4,700కుపైగా కేంద్రాలను ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంది. ఈ క్రమంలో పలువురు రైతులు ఆత్మ హత్యలు చేసుకున్నారు. దీనిపై బీజేపీ అధ్యక్షుడు పర్యటన చేస్తుం డగా దాడి జరిగింది. ఈదాడి టీఆర్ఎస్ కార్యకర్తలే చేశారని ఆరోపిం చారు. మరోవైపు టీఆర్ఎస్ ఈ దాడి తమ కార్యకర్తలు చేయలేదని ఖండిస్తోంది. ఏది ఏమైనా అన్ని పార్టీలు రాజకీయాలు పక్కన పెట్టి అన్నదాతలను ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే రైతులు అకాల వర్షాలు, చీడపీడలు, ప్రకృతి విపత్తులతో సతమత మవుతూ ఉన్నారు. ఈ సమయంలో వారిని ఆదుకోవాల్సి ఉంది.ఇదే సమయంలో అన్నదాతలు సైతం తెలివిగా వ్యవహరిస్తూ ప్రభుత్వ, నాయకుల ప్రకటనలకు మోసపోకుండా తమ నేలల్లో ఏ పైరు వేస్తే మంచిదో వ్యవసాయశాఖ అధికారులు సూచనలు పాటించి పంటలు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భూసార పరీక్షలు చేసి తమ నేలలో ఏ పంటకు అనువుగా ఉంటుందో రైతన్నలు ఆలోచించాల్సిన అవసరం ఉంది. కానీ తెలంగాణ మోజార్టీ రైతులు చదువు లేకపోవడం వలన ఈ దిశగా ప్రయత్నాలు చేయడం లేదు. వ్యవసాయ శాఖ కూడా దీనిపై రైతులను అప్రమత్తం చేయాల్సి ఉన్నా ఆదిశగా ప్రయత్నాలు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని చెప్పవచ్చు.

# ముందు చూపుతోనే... మూడు పై వెనక్కి

విజయవాడ, నవంబర్ 27, (న్యూస్ పల్స్)మూడు రాజధానులు బిల్లు ఉపసంహరణ నిజంగా సంచలనమే. ఆందోళన చేస్తున్న రైతులు ఇది తమ విజయం అనుకున్నారు. ఈ చర్యను విపక్షాలు స్వాగతించాయి. బిల్లు ఉపసంహరణ హర్షణీయమని హర్షం వ్యక్తం చేశాయి. ఇది ఏడు వందల రోజుల పోరాట విజయం అన్నారంతా..కానీ, ఆ ఆనందం ఎక్కువ సేపు నిలువ లేదు. ఉపసంహరణపై సీఎం వివరణతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. ఇది మోసం అంటూ ఆందోళనకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.బిల్లు ఉపసంహరణ ఏపీ సర్కార్ వ్యూహంలో భాగం. రాజధాని వికేంద్రీకరణ అంశంపై హైకోర్టు విచారణ తుది దశలో ఉంది. దీనికి సంబంధించి న్యాయస్థానం నుంచి వస్తున్న వ్యాఖ్యలు చూస్తే తీర్పు, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతికూలంగా వచ్చేలా అనిపిస్తోంది. ఈ దశలో బిల్లును ఉపసంహరించుకుంటే కోర్టులో ఎదురు దెబ్బతగలకుండా జాగ్రత్త పడవచ్చు. ఒకసారి కోర్టులో ఓడిపోతే, సుప్రీంకోర్టుకు వెళ్లాల్సి వుంటుంది. అక్కడా చుక్కెదురైతే నైతికంగా ఎదురుదెబ్బ తగిలినట్టవుతుంది. దీని నుంచి బయటపడేందుకే ఉపసంహరణ ఎత్తుగడ అని విశ్లేషకులు అనుమానిస్తున్నారు.వాస్తవానికి జగన్ ప్రభుత్వానికి కోర్టు వ్యవహారాల్లో అంత లక్ లేదు. పలు మార్లు న్యాయస్థానంలో చుక్కెదురయింది.అనేక అంశాల్లో ఎదురుగాలి తప్పలేదు. పలు నిర్ణయాలను న్యాయస్థానాలు తప్పుపట్టాయి. అత్యధిక సందర్భాల్లో హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో జగన్ ప్రభుత్వానిక అనుకూలత కన్నా ప్రతికూలతే కనిపించింది. ఐతే , చంద్రబాబులా తమకు న్యాయమూర్తులను మేనేజ్ చేయటం రాదంటూ వైసీపీ నాయకులు సమర్థించుకునే ప్రయత్నం చేశారు. ఇప్పుడు మరోసారి కోర్టులో చుక్కెదురయ్యే ప్రమాదాన్ని జగన్ ప్రభుత్వం పసిగట్టింది. తీర్పు ఎలావుంటుందో అర్థమైనట్టు కనిపిస్తోంది.పరిపాలనా వికేంద్రీకరణ, సీఆర్‌డీఏ రద్దు చట్టాలను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాల్లో ఇద్దరు న్యాయమూర్తుల ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయని.. అందుచేత వాటిని విచారిస్తున్న త్రిసభ్య ధర్మాసనం నుంచి వారు వైదొలగాలని రాష్ట్రప్రభుత్వం అంతకు ముందు హైకోర్టును కోరింది. ధర్మాసనంలోని ఇద్దరు న్యాయమూర్తులకు అమరావతిలో ప్లాట్లు ఉన్నాయని.. వ్యాజ్యాలపై తుది తీర్పులో వారి ఆర్థిక ప్రయోజనాలతో ఇమిడి ఉన్నప్పుడు ఆటోమేటిగ్గా వారు విచారణకు అనర్హులవుతారని ప్రభుత్వం వాదించింది. ఐతే కోర్టు ఆ అభ్యర్థనను తోసిపుచ్చింది.మూడు రాజధానుల బిల్లు రాజ్యంగ బద్ధమా ..కాదా అన్నది కోర్టు ముందున్న వ్యవహారం. ఇందులో న్యాయపరమైన అంశాలు ఉన్నాయి. ముఖ్యంగా శాసనమండలి ఆమోదం పొందిందా? లేదా? అన్నది వాటిలో ఒకటి. ఈ బిల్లు తెచ్చేనాటికి మండలిలో వైసీపీకి సరిపడా బలం లేదు. అందుకే టీడీపీ తెలివిగా దానిని సెలెక్ట్ కమిటీకి పంపింది. అయితే అది కమిటీకి వెళ్లిందా లేదా అన్న గందరగోళం ఇంకా అలాగే ఉంది. దాంతో పాటు ఇందులో లెజిటిమేట్ ఎక్స్‌పెక్టేషన్స్ కూడా ఉన్నాయి. అంటే ప్రభుత్వం, ప్రజలకు మధ్య ఒప్పంద ప్రయోజనాలు. రాజధానిగా అమరావతిపై రైతులతో ప్రభుత్వం అలాంటి ఒప్పందమే చేసుకుంది. కాబట్టి ఈ లెజిటిమేట్ ఎక్స్‌పెక్టేషన్ కూడావ విచారణలో కీలకం అయ్యే అవకాశం ఉంది.రాజధాని నిర్మాణం కోసం అమరావతి ప్రాంత రైతులు ముప్పయ్ వేల ఎకరాల భూమిని ఇచ్చారు. కాబట్టి ప్రస్తుత ప్రభుత్వం ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటే కోర్టులో నిలవకపోవచ్చు. లీగల్ గ్రౌండ్స్ మీద వీగిపోతే సుప్రీం కోర్టుకు వెళ్లినా ప్రయోజనం ఉండదు. ఇదంతా చూసి కోర్టులో వీగిపోతామనే అనుమానంతోనే బిల్లును ఉపసంహరించుకున్నట్టు అర్థమవుతుంది. ఐతే, ఉపసంహరించినంత మాత్రాన మూడు రాజధానుల ఆలోచలనకు జగన్ ప్రభుత్వం దూరం అయిందనుకోవటం తప్పు. న్యాయ నిపుణులతో చర్చించి, విస్తృత స్థాయిలోఅభిప్రాయసేకరణ జరిపి మరింత సమగ్రమైన ,మెరుగైన బిల్లు తీసుకువచ్చే అవకాశం ఉంది. అందువల్ల రైతుల ఆందోళనకు, ఐకాసీ యాత్రకు తెలుగుదేశం నిరసనలకు జగన్మోహన్ రెడ్డి భయపడ్డారనుకుంటే పొరపాటే అవుతుంది.బిల్లు ఉపసంహరణ అవకాశాన్ని జగన్ తన రాజకీయ ప్రయోజనాలకు కు అనుకూలంగా మార్చుకోవచ్చు. రాజకీయంగా సానుకూలత వచ్చే వరకు దీనిపై కాలయాపన చేయవచ్చు. మళ్లీ తనకు సరైన సమయం అనుకున్నప్పుడు దీనిని తిరిగి తెరమీదకు తీసుకురావచ్చు. అంటే, జగన్ ఇప్పుడు ఒక్క అడుగు వెనక్కి వేసినట్టు అనిపించినా.. రెండు అడుగులు ముందుకు వేసే వ్యూహంతో వెళుతున్నట్టు స్పష్టంగా అర్థమవుతోంది.మూడు రాజధానుల బిల్లు ఉపసంహరణకు, మోడీ తీసుకున్న మూడు వ్యవసాయ చట్టాల రద్దుకు కొంత పోలిక కనిపిస్తోంది. ఈ రెండు రెండు నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకున్నవే. రెండు సందర్భాలలోనూ రైతులే అందోళనకారులు. ఉపసంహరణ సమయంలో ఇద్దరి ప్రకటన దాదాపు ఒకేలా ఉన్నాయి. నూతన వ్యవసాయ చట్టాలు రైతులకు ప్రయోజనం చేస్తాయనే చివరకు అన్నారు. జగన్ ప్రకటన కూడా దాదాపు అలాగే ఉంది. దీనిని బట్టి నరేంద్ర మోడీ నిర్ణయం నుంచి జగన్ స్ఫూర్తి పొందినట్టు అనిపిస్తోంది. అయితే, మోడీ నిర్ణయంలో తక్షణ రాజకీయ ప్రయోజనాలు దాగున్నాయి. కానీ జగన్ కు ఆ పరిస్థితి లేదు. వ్యూహంలో మాత్రమే సారూప్యత ఉంది.మూడు రాజధానుల విషయంలో అనేక అపోహలు, అనుమానాలు, న్యాయపరమైన చిక్కులు వచ్చాయి. పైగా అమరావతి చుట్టే ప్రతిపక్షాల రాజకీయం నడుస్తోంది. కొద్ది రోజులు ఈ అంశాన్ని కోల్డ్‌స్టోరేజ్ లో పెడితే తాత్కాలికంగానైనా ప్రతిపక్షాలను నిరాయుధలను చేయవచ్చు అన్న వ్యూహం కూడా ఇందులో ఉంది. అంతేకాదు, అమరావతి వల్ల ప్రభావితం అయ్యే ప్రాంతాలలో తమపట్ల అసంతృప్తిని తగ్గించుకునే అవకాశం ఉంటుంది. ఇదే సమయంలో ఉత్తరాంధ్ర, రాయలసీమలో వైసీపీ ఎదురుదాడి చేయవచ్చు.ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షలకు ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయనే అనే భావన తీసుకురావచ్చు. తద్వారా విపక్షాలను ఇరుకున పెట్టే అవకాశం ఉంది.వాస్తవానికి అమరావతి సెంటిమెంట్ యావత్ రాష్ట్ర ప్రజల నిర్ణయానికి ప్రాతిపదిక కాదు. ఈ విషయం ఇప్పటికే స్పష్టంగా తెలిసింది. బద్వేల్, తిరుపతిలో వైసీపీ ఘన విజయాలే అందుకు ఉదాహరణ. రాష్ట్రం అంతా అమరావతి సెంటిమెంట్ ఉంటే వైసీపీ అభ్యర్థులు ఎలా గెలుస్తారు? కాబట్టి భవిష్యత్‌లో అయినా డీసెంట్రలైజేషన్ అనేది స్పష్టం. అమరావతి రైతులతో చర్చలు జరిగే అవకాశం ఉందా అన్నది తెలియాల్సి వుంది. ఉపసంహరణపై ప్రభుత్వం కోర్టుకు అఫిడవిట్ సమర్పించనుంది. ఈ సందర్భంలో హైకోర్టు ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసే అవకాశం ఉండవచ్చు.ఒకసారి కోర్టు వ్యవహారం ముగిశాక మరొకసారి రాజధాని వికేంద్రీకరణ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ సారి శాసన మండలిలో కూడా వైసీపీకి మెజారిటీ ఉంది. అందువల్ల బిల్లు ప్రవేశపెడితే సెలెక్ట్ కమిటీకి పంపాలనే ప్రతిపాదన కూడా రాదు. నిజానికి గత ప్రభుత్వానికి గానీ ఇప్పటి ప్రభుత్వానికి గానీ రాజధాని నిర్మాణం ముఖ్యం కాదు. ఈ మొత్తం వ్యవహారన్ని చూస్తే రాజధాని అంశాన్ని రాజకీయంగా వాడుకోవటమే వారికి ముఖ్యమని అర్థమవుతోంది. నిజానికి మూడు రాజధానుల బిల్లు వెనక నిజంగా ఉన్నది పాలనా వికేంద్రీకరణా? లేదంటే చంద్రబాబు అమరావతి కలను భగ్నం చేయటమా? అంటే ఎవరికి తోచినట్టు వారు అర్థం చేసుకోవచ్చు.సీఎం జగన్ తిరిగి మూడ రాజధానుల బిల్లు తెస్తామని అన్నారు.

# 10 వేల కోట్ల కోసం వన్ టైం సెటిల్మెంట్

విజయవాడ, నవంబర్ 27, (న్యూస్ పల్స్)ఏపీలో జగన్ ప్రభుత్వం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో వుంది. ఈ నేపథ్యంలో ఆదాయం సమకూర్చుకునేందుకు దొరికిన ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు. గత ప్రభుత్వాలు పేదలకిచ్చిన ఇళ్ల రిజిస్ట్రేషన్ విషయంలో వడి వడిగా అడుగులేస్తోంది ప్రభుత్వం. వన్ టైమ్ సెటిల్మెంట్ స్కీం కింద రిజిస్ట్రేషన్లు చేసే అధికారాలను గ్రామ, వార్డు సెక్రటరీలకు దఖలు పరిచింది జగన్ సర్కార్. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం ఆదాయంపై కన్నేసింది. ఈ పథకం ద్వారా ఖజానా నిండుతుందని ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని భావిస్తోంది.జగన్ తనకు అధికారం కట్టబెట్టిన పాదయాత్రలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే పనిలో పడ్డారు. గతంలో ఇంటి కోసం తీసుకున్న లబ్ధిదారుల రుణాలను మూడులక్షల వరకు మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే రెండునెలల క్రితమే ఏపీ క్యాబినెట్ దీనికి భిన్నంగా కొత్త ఆలోచనతో ముందుకొచ్చింది. చంద్రబాబు హయాంలోనే కాదు.. ఎన్టీఆర్ కాలం నుంచి ఇళ్ల బకాయిలను వన్ టైం సెటిల్మెంట్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. వన్ టైం సెటిల్మెంట్ ద్వారా లబ్ధిదారుల నుంచి నిర్ణీత మొత్తంలో డబ్బులు కట్టించుకొని వారి ఆస్తులను వారిపేరిట రిజిస్ట్రేషన్ చేసిస్తారు. వీరినే ప్రభుత్వ హక్కుదారులుగా ప్రభుత్వం గుర్తించనుంది.ఈ వన్ టైం సెటిల్మెంట్ కింద లబ్ధిదారులు గ్రామాల్లో ఐతే రూ.10వేలు, పట్టణాల్లో అయితే రూ.15వేలు, నగరాల్లో ఐతే 20వేలు చెల్లించాలి. అదే లబ్ధిదారుల ఇళ్లను మరొకరు కొనుగోలు చేసి ఉన్నట్లయితే ఈ డబ్బులకు రెట్టింపు చెల్లించాలి. అంటే గ్రామాల్లో 20వేలు, పట్టణాల్లో 30వేలు, నగరాల్లో 40వేలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఎన్టీఆర్ హయాం నుంచి లెక్కలు వేస్తుండటంతో అప్పటి నుంచి ఇళ్లు భారీగానే చేతులు మారే అవకాశం ఉంటుందని భావిస్తుంది. ఈ నేపథ్యంలో సగటున ఒక్కో ఇంటికి 20వేలు లబ్ధిదారులు డబ్బులు చెల్లించినా దాదాపుగా ప్రభుత్వానికి 10వేల కోట్ల రాబడి రాగలదని అంటున్నారు.

ఇప్పుడున్న పరిస్థితుల్లో 10వేల కోట్లు అంటే మాటలు కాదు.ప్రభుత్వ లెక్కల ప్రకారం 50 లక్షల మంది పేదలు రుణాలు కట్టాల్సి ఉందని అంటున్నారు. వీరిలో 4.57లక్షల మంది పట్టణ ప్రాంతాల లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో కనీసం సగం మంది పథకంలో డబ్బులు కట్టినా రూ.5వేల కోట్లుసర్కారు ఖజానాకు జమ అవుతాయి. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ వన్ టైం సెటిల్మెంట్ ను లబ్ధిదారులు ఏమేరకు సద్వినియోగం చేసుకుంటారో వేచిచూడాలి. తాజాగా గ్రామ, వార్డు సెక్రటరీలపై వన్ టైం సెటిల్ మెంట్ బాధ్యత పెట్టింది. వారు ఈ పథకాన్ని ఎలా ముందుకు తీసుకెళతారో చూడాలి. వన్ టైం సెటిల్ మెంట్ వర్కవుట్ అయితే మాత్రం జగన్ సర్కార్ అప్పులు తెచ్చే బాధ కొంచెం తగ్గుతుంది.

# ఉక్కు సంకల్పంతో సాగిపోతున్న అమరావతి రైతుల పాదయాత్ర

### బ్రహ్మ రథం పడుతున్న ప్రజలు

. నెల్లూరు నవంబర్ 27అమరావతి రైతుల పాదయాత్ర ఉక్కు సంకల్పంతో దిగ్విజయంగా సాగుతుందని, ఈ పాదయాత్రకు ఆయా ప్రాంత ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారనిటీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పేర్కొన్నారు.27 వరోజు నెల్లూరు నగరంలో మహా పాదయాత్ర ఘనంగా సాగింది. ఈ కార్యక్రమానికి కి ముఖ్య అతిథులుగా టిడిపి నేత , మాజీ మంత్రివర్యులు దేవినేని ఉమామహేశ్వర రావు పాల్గొన్నారు.మహా పాదయాత్రలో పాల్గొన్న మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, షేక్ అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, గూటూరు కన్నబాబు, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి సురేందర్ రెడ్డి, తాళ్ళపాక అనురాధ,పట్టాభి ,జెన్నీ రమణయ్య మరియు బిజెపి, సిపిఎం, సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.అమరావతి ఉక్కు సంకల్పంతో సాగిపోతున్న అమరావతి రైతుల పాదయాత్ర కు ప్రజలు బ్రహ్మ రథం పడుతున్నారు – టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర27 వరోజు నెల్లూరు నగరంలో కొనసాగుతున్న మహా పాదయాత్ర...మహా పాదయాత్రలో పాల్గొన్న మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, షేక్ అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, గూటూరు కన్నబాబు, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి సురేందర్ రెడ్డి, తాళ్ళపాక అనురాధ,పట్టాభి ,జెన్నీ రమణయ్య మరియు బిజెపి, సిపిఎం, సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు...అమరావతి రైతుల పాదయాత్రకు కనీవినీ ఎరుగని రీతిలో ప్రజల నుంచి స్పందన లభిస్తోంది.పాదయాత్ర పొడవునా ఎదురయ్యే గ్రామాలలో విద్యార్థులు,మహిళలు, రైతులు, వ్యాపారులు, చివరకు వృద్ధుల వరకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలుపుతున్నారు.

### కుమారారామ భీమేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రోజా

సామర్లకోట కుమారారామ భీమేశ్వర స్వామివారిని ప్రతి సంవత్సరం దర్శించుకుంటారని దీనిలో భాగంగా ఈ సంవత్సరం కూడా సామర్లకోట పంచారామాల్లో ఒకటై నటువంటి కుమారారామ భీమేశ్వర స్వామిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని నా తండ్రిల దేవుణ్ణి భావిస్తానని .. స్వామివారి బలంతో ప్రజలకు అండగా ఉంటానని . పంచారామాలో ఒకటి అయినటువంటి నిన్న అమరేశ్వరుని దర్శించుకోవడం జరిగింది అని ఇవాళ భీమేశ్వర స్వామి దర్శనం చేసుకున్నామని మిగిలిన మూడు పంచారామాల ను ఈరోజు రేపు దర్శించుకుంటారని కార్తీకమాసంలో శివుని విష్ణువుని వెంకటేశ్వర స్వామి వర్లని దర్శించుకుంటే శుభాలు కలుగుతాయని నాతోపటు ఈ రాష్ట్రంలో అందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్లు ఆమె తెలిపారు

# అనంతలో కలివిడిగా తమ్ముళ్లు



అనంతపురం, నవంబర్ 27, (న్యూస్ పల్స్)వంద అడుగుల్లో నీరు పడుతుందంటే.. 99 అడుగులు తవ్వాక పనులు ఆపేస్తే ఎలా? ఇన్ని రోజులూ ఫ్యాక్షన్, రాజకీయ కక్షలు రూపుమాపేందుకు చేసిన ప్రయత్నం ఇలాంటిదే. మిగిలిన ఆ ఒక్క అడుగు తవ్వాలి. అందుకే తాను వచ్చానంటున్నారా? ఆ యువనేతది ఇదే ఆలోచనా? మార్పు మొదలైందా లేక ఇంకేదైనా వ్యూహం ఉందా?ఫ్యాక్షన్‌కు పుట్టినిల్లులాంటి అనంతపురం జిల్లాలో రెండు కుటుంబాల మధ్య దశాబ్దాల వైరం ఉంది. అందులో ఒకటి పరిటాల కుటుంబం. రెండోది జేసీ ఫ్యామిలీ. రెండు కుటుంబాలదీ ఒకే జిల్లానే అయినా.. వారి రాజకీయాలు, వ్యవహారాలు సాగించేది వేరు వేరు ప్రాంతాల్లో. ఇప్పుడు ఇద్దరూ ఒకే పార్టీలో ఉన్నప్పటికీ.. గతంలో వేర్వేరు. పరిటాల రవి టీడీపీని తన కనుసన్నల్లో నడిపిస్తే.. కాంగ్రెస్ పార్టీలో జేసీ బ్రదర్స్‌ది వన్‌మెన్ షో. కాంగ్రెస్ జాతీయ పార్టీ అయినప్పటికీ జిల్లాను జేసీ దివాకర్‌రెడ్డి లీడ్ చేసేవారు. ఈ క్రమంలోనే పరిటాల రవి.. జేసీల మధ్య రాజకీయ వైరం ఏర్పడింది. అంతేతప్ప రెండు కుటుంబాల మధ్య కొట్టుకోవడాలు.. చంపుకోవడాలు లేవు. కాకపోతే రాజకీయ వైరం ముదురు పాకాన పడింది.రాష్ట్ర విభజన తర్వాత జేసీ బ్రదర్స్ కాంగ్రెస్‌ను వీడి టీడీపీలోకి వచ్చారు. బద్ధ శత్రువులైన పరిటాల, జేసీలు ఒకే పార్టీలో ఉండటం చాలా మందికి మింగుడు పడలేదు. జేసీ హాజరైన వేదికలపైకి పరిటాల సునీత వచ్చినా ఏ రోజు పలుకరించుకోలేదు. కనీసం ఒకరి ముఖం ఒకరు చూసుకోలేదు. జేసీ బ్రదర్స్ ప్రత్యక్ష రాజకీయాల నుంచి సైడై వారి కుమారులను రంగంలోకి దించారు. ఇటు సునీతతోపాటు ఆమె తనయుడు శ్రీరామ్ యాక్టివ్ అయ్యారు.కాలం మారింది. పగలు.. కక్షలు తగ్గాయి. యువ నాయకులు ఎంట్రీతో పాతవన్నీ పక్కన పెట్టి శ్రీరామ్, జేసీ కుమారులు పవన్, అస్మిత్‌లు కలిశారు. చాలా సందర్భాల్లో మాట్లాడుకున్నారు కూడా. ఇది చాలామందికి ఆశ్చర్యం కలిగించింది. దీనికంటే ఆశ్చర్యం ఏంటంటే.. ఇటీవల లోకేష్ జిల్లా పర్యటనలో జేసీ ప్రభాకర్ రెడ్డి, పరిటాల శ్రీరామ్ కలవడం. ఆలింగనాలు.. నవ్వులు పువ్వులు ఇలా ఒకటేంటి.. ఫ్యాక్షన్ సినిమా ఎండింగ్‌లో ఉండే సీన్‌లు కనిపించాయి. రాష్ట్రంలో హాట్‌టాపిక్‌గా మారాయి.ప్రస్తుతం పరిటాల కుటుంబానికి రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి సోదరులతో రాజకీయ శతృత్వం ఉంది. వీరి మధ్య ఫ్యాక్షన్ గొడవలేమి లేకపోయినా.. అంతకుమించిన రాజకీయ వైరం ఉంది. నాలుగు రోజుల క్రితం వరదల్లో 10 మంది చెన్నేకొత్తపల్లి వద్ద నీటిలో చిక్కుకపోయారు. వారిని రక్షించేందుకు హెలికాప్టర్ వచ్చింది. ఈ సమయంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సోదరుడు తోపుదుర్తి చందు అక్కడికి వచ్చారు. ఈసమయంలో అక్కడ ఈలలు, కేకలు మామూలుగా లేవు. ఇలా వరస పరిణామాలు చూస్తే మార్పు మొదలైందా అంటే.. అవుననే అనుకుంటున్నారట అక్కడి జనం.కొత్తతరం నుంచి వచ్చిన శ్రీరామ్.. వందో అడుగు వేస్తున్నారా? అసలు ఎప్పటికీ కలవవు అనుకున్న జేసీ, పరిటాల కుటుంబాలు కలవడం ఏంటి? ఆప్యాయంగా కౌగిలింతలతో మాట్లాడుకోవడం ఏంటి? ఇప్పటికీ పచ్చగడ్డివేస్తే భగ్గుమనే తోపుదుర్తి సోదరులతో మాటలు కలపడం ఏంటి? అనంత ఫ్యాక్షన్ చరిత్రలో ఎన్నో ఘట్టాలు ఉన్నాయి.

# క్షణ క్షణం.. రాయుల చెరువు టెన్షన్

తిరుపతి నవంబర్ 27, (న్యూస్ పల్స్)ఒక్క చెరువు వేలాదిమందిని కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. తిరుపతి రాయలచెరువు తాజా దుస్థితికి వివిధ శాఖల అధికారుల మధ్య సమన్వయలోపమే కారణమంటున్నారు బాధిత గ్రామస్థులు. 10 రోజులు క్రితమే తూములు మూసివేతకు గురైన విషయాన్ని రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకువెళ్ళారు ముంపు గ్రామాల ప్రజలు. రాయలచెరువు వరద ప్రవాహానికి తగ్గట్టుగా నీరు బయటకి వెళ్ళేలా అప్పట్లోనే నాలుగు తూములు ఏర్పాటు చేశారు రాయలవారు.నీటి నిల్వలు ఎక్కువగా వుండాలంటూ ఒక్కటిన్నర తూముని మూసివేశారు దిగువ గ్రామస్థులు. ఇదే ఇప్పుడు వారి పాలిటశాపంలా మారిందంటున్నారు ముంపు గ్రామస్థులు. నిన్న మంత్రులు పర్యటన సమయంలోను తూములు మూసివేత అంశానే ప్రధానంగా ప్రస్తావించారు ముంపు గ్రామస్థులు. 2 వేల ఎకరాలలో వున్న చెరువుని 45 ఎకరాలకు కుదించేలా ఆక్రమణలకు గురైందంటూ వాపోతున్నారు దిగువ గ్రామస్థులు. ముఖ్యమంత్రి వద్దకు సమస్యని తీసుకువెళ్ళి పరిష్కరిస్తామని గ్రామస్థులకు హామీఇచ్చారు ఇంచార్జి మంత్రి గౌతమ్ రెడ్డి.ప్రస్తుతం చెరువుకు లీకేజీగా వస్తూన్నది ఉట నీరుగా భావిస్తున్నారు అధికారులు. 500 సంవత్సరాల క్రితమే రాయల వారు చెరువుకట్టను రాళ్ల మధ్య సీసంతో నిర్మించారంటున్నారు గ్రామస్థులు. పటిష్టంగా వున్న చెరువు కట్ట తెగే అవకాశం లేదంటున్నారు దిగువ గ్రామస్థులు. ఒకవేళ చెరువుకట్ట తెగితే శ్రీకాళహస్తి వరకు నీటి ప్రవాహం వుంటుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారురాయలచెరువుకు గండి పడితే భారీ ప్రమాదం సంభవించే అవకాశం వుంది. గండిని పూడ్చే అవకాశం లేదంటున్నారు అధికారులు. చెరువు చుట్టూ వందలాది గ్రామాలు వున్నాయి.బలిజపల్లి, మిట్టురు, కమ్మకండ్రిక ,సి రామాపురం,రామచంద్రాపురంవంటి దిగువ గ్రామాలను ఖాళీ చేయిస్తున్నారు. గండి పడితే తిరుచానురు స్వర్ణముఖి వరకు నీటి ప్రవాహం వుండే అవకాశం వుంది. దీంతో రాయలచెరువు ప్రాంతానికి చేరుకుంటున్నారు పోలీసులు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు సేవలందించేలా సిద్దం చేస్తున్నారు అర్బన్ ఎస్పీ అప్పలనాయుడు. అవసరమైతే హెలికాప్టర్లు రంగంలోకి దింపే యోచనలో వున్నారు అధికారులు, నిన్నటి నుంచి రాయలచెరువుకు ప్రమాదం పొంచి వుందంటూ ప్రజల్ని హెచ్చరిస్తున్నారు. సంజీవరాయపురం, బలిజపల్లి, పివి పురం, గంగమాంబపురం, రామిరెడ్డి పురం, గంగిరెడ్డి పల్లి, పద్మావళ్ళిపురం, కమ్మ కండ్రిగ, నడవలూరు, నెన్నూరు, కట్ట కింద వెంకటాపురం, నాగూర్ కాలనీ, కుంట్రపాకం, వెంకటరామాపురం, కమ్మపల్లి,గణేశ్వర పురం, సొరకాయల పాల్యం, వేమూరు, కాయం పేట, వడమాలపేట, తిరుచానూరు వంటి గ్రామాలు వున్నాయి. దాదాపు యాభైవేల మంది జనాభా ఇక్కడ నివశిస్తున్నారు. పరిస్థితి ఎలా మారినా అప్రమత్తంగా వున్నామని అధికారులు తెలిపారు.

# పార్టీ లో చెరో మాట

అనంతపురం, నవంబర్ 27, (న్యూస్ పల్స్)చంద్రబాబు నాయుడు బోరున విలపించారు. తన కుటుంబాన్ని అసెంబ్లీలోకి లాగారంటూ ఆయన వెక్కి వెక్కి ఏడ్చారు. జనం సంగతి పక్కన పెడితే సొంత పార్టీల నేతల నుంచే స్పందన అంతంత మాత్రంగా వచ్చింది. ముఖ్యమైన నేతలెవరూ దీనిపై పెద్దగా మాట్లాడానికి ఇష్టపడలేదు. ప్రధానంగా రాయలసీమ నుంచి చంద్రబాబుకు మద్దతుగా ఎవరూ పెద్దగా స్పందించలేదు. ఎందుకంటే ఏడుపు అంటే అక్కడి నేతలకు గిట్టదు. అందులో జేసీ బ్రదర్స్ ఒకరు. నిజానికి జేసీ బ్రదర్స్ అందరికంటే ముందుంటారు. టీడీపీ లో కొన్ని ఇబ్బందులు పడుతున్నప్పటికీ వారికి అది తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదు. అందుకే ఇటీవల అనంతపురానికి వచ్చిన లోకేష్ కు స్వాగతం పలికేందుకు స్వయంగా జేసీ ప్రభాకర్ రెడ్డి వచ్చారు. వారికి పార్టీ మారే ఆలోచన లేకపోయినప్పటికీ చంద్రబాబు వద్ద తమ పంచాయతీ తేలాలన్న పట్టుదలతో ఉన్నారు. జిల్లా పార్టీలో తమ పరిస్థితి ఏంటన్నది వారు బాబును నిలదీయాలనుకుంటున్నారు. జిల్లా పార్టీ కొందరి చేతుల్లో పెట్టడాన్ని జేసీ బ్రదర్స్ సహించలేకపోతున్నారు. తమ వర్గం బలంగా ఉన్న నియోజకవర్గాలకు కూడా తమను వెళ్లకూడదంటూ ఆంక్షలు పెట్టడమేంటని జేసీ బ్రదర్స్ ప్రశ్నిస్తున్నారు. అందుకే చంద్రబాబు ఏడుపు ఎపిసోడ్ కు వారు దూరంగా ఉన్నారని తెలిసింది. జేసీ బ్రదర్స్ కు ఏడుపంటే పడదట. నాయకుడన్న వాడు ఏడవకూడదని, ఏడిపించాలన్నది వారి లక్ష్యం. అందుకే చంద్రబాబు విషయంలో స్పందించలేదంటున్నారు. చంద్రబాబును అమరావతిలో ఉన్నప్పుడు ఆయన చుట్టూ కోటరి ఉంటుందని జేసీ బ్రదర్స్ భావిస్తున్నారు. అందుకే ఆయన హైదరాబాద్ లో ఉన్నప్పుడే వెళ్లి కలవాలని డిసైడ్ అయ్యారు. జిల్లా పర్యటనల్లోనూ ఆయన వెంట కోటరీ ఉంటుందని, తమ మనసులో మాట చెప్పుకోవడానికి హైదరాబాద్ కరెక్ట్ అని జేసీ బ్రదర్స్ భావిస్తున్నారు. మొత్తం మీద జేసీ బ్రదర్స్ ఇక బాబుతో తాడో పేడో తేల్చుకునేందుకే సిద్ధమయ్యారని తెలుస్తోంది.

# నాలుగు నియోజకవర్గాలపై దృష్టి

గుంటూరు, నవంబర్ 27, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబును నిండు అసెంబ్లీలో అవమానించిన నలుగురిపై ఇప్పుడు టీడీపీ గురి పెట్టింది. ఆ నలుగురిని టార్గెట్ చేసింది. వారిని వచ్చే ఎన్నికల్లో ఓడించడమే లక్ష్యంగా పనిచేయాలని ఇప్పటికే చంద్రబాబు అక్కడి నేతలకు పిలుపునిచ్చారు. వారికి అవసరమైన అర్థ, అంగబలాలను సమకూరుస్తానని హామీ ఇచ్చారు. ఆ నలుగురే కొడాలి నాని, వల్లభనేని వంశీ, ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, అంబటి రాంబాబులు. నియోజకవర్గాల్లో 2014లో మూడింటిలో టీడీపీ గెలిచిన విషయాన్ని కూడా గుర్తు చేస్తున్నారు. 2014 ఎన్నికల్లో గన్నవరం, కాకినాడ టౌన్, సత్తెనపల్లిలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించింది. 2014కు ముందు కూడా టీడీపీ గుడివాడలో గెలిచింది. ఈ విషయాలను గుర్తు చేస్తున్నారు. గుడివాడలో కొడాలి నానికి పోటీగా ఈసారి వంగవీటి రాధాను దించాలన్న యోచనలో చంద్రబాబు ఉన్నారు. ఇక సత్తెనపల్లిలో ఇన్ ఛార్జిని చంద్రబాబు ఇప్పటి వరకూ తేల్చలేదు. అక్కడ కోడెల శివరాం, రాయపాటి వర్గాలు పోటీ పడుతున్నాయి. అయితే కోడెల శివరాంకు ఇన్ ఛార్జి పదవి ఇవ్వకపోతే తానే కోడెలకు అన్యాయం చేశానన్న అపప్రధను చంద్రబాబు ఎదుర్కొనాల్సి ఉంటుంది. అందుకే రాయపాటిని విజయవాడ పశ్చిమానికి పంపి సత్తెన పల్లిలో ఇరు వర్గాలను కూర్చోబెట్టి రాజీ చేయాలని చంద్రబాబు భావన. అప్పుడే అంబటి రాంబాబును సులువగా ఓడించవచ్చని లెక్కలు వేస్తున్నారు. కాకినాడ సిటీ నియోజకవర్గంలో వనమాడి వెంకటేశ్వరరావు అలియాస్ కొండబాబు బలమైన నేతగా ఉన్నారు. ఆయనకు కాస్త అన్ని రకాలుగా సహకారం అందిస్తే ద్వారంపూడిని ఓడించడం పెద్ద కష్టమేదీ కాదని అంటున్నారు. ద్వారంపూడిపై నియోజకవర్గంలో వ్యతిరేకత కన్పిస్తుండటం తమకు కలసి వస్తుందని టీడీపీ అంచనా వేస్తుంది. గన్నవరంలో గద్దె కుటుంబాన్ని బరిలోకి దింపి వంశీని ఓడించాలన్న ఆలోచన కూడా ఉంది. మొత్తం మీద ఈ నాలుగు నియోజకవర్గాల్లో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలన్న టీడీపీ ఆశలు ఏమేరకు నెరవేరుతాయన్నది చూడాల్సి ఉంది.

# గన్నవరం ఎయిర్ పోర్టులో మోహన్ బాబు

విజయవాడ నటుడు మోహన్ బాబు శనివారం హైదరాబాద్ నుండి ఇండిగో విమానంలో గన్నవరం ఎయిర్ పోర్ట్ కి చేరుకున్నారు. పలువురు అభిమానులు అయన కు ఎయిర్ పోర్ట్ లో ఘన స్వాగతం పలికారు. గన్నవరం ఎయిర్ పోర్ట్ లో అయన మీడియాతో ముచ్చటించారు. నా విజయవాడ రావడం నాకు చాలా సంతోషం. ఆత్మీయులను కలిసేందుకు విజయవాడ కి వచ్చానని అన్నారు. తరువాత అయన పెదపారుపూడి మండలం వానపాముల గ్రామానికి బయల్దేరి వెళ్లారు. ఏపీ అధికార భాష సంఘం అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తల్లి రంగనాయకమ్మ ఇటీవల మృతి చెందటంతో ఆ కుటుంబాన్ని పరామర్శించడానికి మోహన్ బాబు వచ్చారు.

# మహిళ అనుమానస్పద మృతి

కడప కడప జిల్లా బ్రహ్మంగారి మఠం మండలం మల్లె పల్లి గ్రామంలో మద్దు లక్ష్మీదేవి(45) అనే మహిళ అనుమానాస్పదం గా మృతి చెందింది . మృతురాలు శుక్రవారం కాత్రి 10 గంటల సమయంలో పశువులకు మేత వేసేందుకు ఇంటి నుంచి వెళ్ళింది . తెల్లవారే సరికి అనుమానాస్పదంగా లక్ష్మీదేవి మృతి చెందింది .15 సంవత్సరాల క్రితం మృతురాలి భర్త మరణించాడు . మృతురాలు కు ఒక కూతురు ఒక కొడుకు వున్నారు . మైదుకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ కొండారెడ్డి , బ్రహ్మంగారిమఠం ఎస్ఐ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు .

## అన్నమయ్య డ్యాం జల ప్రళయం నష్టపోయిన వివరాలు

కడప నవంబర్ 27కడపజిల్లాలో రాజంపేట మండల పరిధిలోని అన్నమయ్య డ్యాం సృష్టించిన జలప్రళయంలో మొత్తం 12 గ్రామాలకు దెబ్బ తగిలింది. ఈ జలప్రళయంలో 39 మంది గల్లంతు కాగా. 27 మంది మృతదేహాలు లభ్యం.. ఇప్పటికీ లభ్యం కానివారి సంఖ్య 12. జవాద్ వరదల్లో 1012 గృహాలు దెబ్బతినగా 433 గృహాలు పూర్తిగా నేలమట్టం అయ్యాయి, 579 గృహాలలు పాక్షికంగా దెబ్బ తిన్నాయి. 422 హెక్టార్లలో ఉద్యానవన పంటలు, 164 హెక్టార్లలో వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని అధికారులు వెల్లడించారు. 905 ఆవులు, గేదెలు 1926 మేకలు, గొర్రెలు మృత్యువాత పడ్డాయని అధికారుల వెల్లడించ్చారు.

# ఆన్‌లైన్ గంజాయి స్మగ్లింగ్ కేసులో.. ఏడుగురి అరెస్టు



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి విక్రయదారులు రోజుకో అడ్డదారిని తొక్కుతున్నారు. ఎలాగైనా అతి తక్కువ సమయంలో కోట్లకుపడగలెత్తాలనే ఉద్దేశంతో రోడ్డు, ఇతర మార్గాల్లో గంజాయిని సరఫరా చేస్తున్న విక్రయదారులు ప్రస్తుతం రూట్‌ను మార్చారు. వినియోగదారులకు నిషేధిత జాబితాలో లేని అన్ని రకాల వస్తువులను ఈ కామర్స్ సంస్థలు నేరుగా సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. అయితే నిషేధిత గంజాయి లాంటి మత్తు పదార్థాలను కూడా సరఫరా చేస్తే ఎవరికి అనుమానం రాదనే అనుమానంతో కొందరు అమెజాన్ సంస్థను ఎంపిక చేసుకొని గంజాయిని సరఫరా చేస్తున్నారు.పసిగట్టిన విశాఖ పోలీసులు నిఘా ఉంచి విశాఖకు చెందిన ఐదుగురిని, మధ్యప్రదేశ్‌కు చెందిన మరో ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ సతీశ్‌కుమార్ వెల్లడించారు. ఈ కామర్స్ వెబ్?సైట్ అమెజాన్? ద్వారా హెర్బల్ ఉత్పత్తులు, కరివేపాకు పేరిట విశాఖ నుంచి మధ్యప్రదేశ్?తోపాటు ఇతర ప్రాంతాలకు గంజాయిని అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించామని ఆయన పేర్కొన్నారు . వీరి వద్ద నుంచి 48 కిలోల గంజాయి, ఒక మోపెడ్, ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్, గంజాయి ప్యాకింగ్ మెటీరియల్, అమెజాన్ టేపులు, బ్యాగ్స్ స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.ఈ కేసులో ఇద్దరు అమెజాన్ డెలివరీ బాయ్స్ పాత్ర ఉందని వెల్లడించారు. కేసు దర్యాప్తు ముమ్మరం చేసి, నిందితులు జీరు కృష్ణమూర్తి, బిజ్జం కృష్ణంరాజు, చిలకపాటి మోహన్ రాజును చీపురుపల్లి వెంకటేశ్వరరావు, చిలకపాటి శ్రీనివాసరావు అరెస్ట్ చేసినట్టు ఎస్?ఈబీ జేడీ వెల్లడించారు. మధ్యప్రదేశ్? గ్వాలియర్ కు చెందిన సూరజ్, ముకుల్ జైస్వాల్?లను అరెస్ట్ చేసినట్లు జేడీ పేర్కొన్నారు.

# తిరుపతిలో కుంగిన భూమి

తిరుపతి ఆంధ్రప్రదేశ్ లో వింత పరి స్థితులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఆధ్యాత్మిక నగరమైన చిత్తూరు జిల్లా తిరుపతిలో ఊహకు కూడా అందని ఘటనలు జరుగుతు న్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తిపో తున్నారు. ఇప్పటికే వరద సృష్టించిన విలయంతో తిరుపతి నగరం అతలా కుతలమైంది. వర్షాలు తగ్గి వరదల నుంచి ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థి తులు నెలకొంటున్నాయి. విలయం నుంచి కోలుకుంటున్న తరుణంలోనే తిరుపతిలో చోటు చేసుకుంటున్న ఘటనలు కలకలం రేపుతున్నాయి. రెండు రోజుల వ్యవధిలో భూమిలో వింత ఘటనలు చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.భూమిలో నుం చి వాటర్ ట్యాంక్ బయటకు రావడం తో ఒక్కసారిగా కలకలం రేగింది. ఈ వింత జరగడానికి కారణలేంటని జనం ఇంకా చర్చించుకుంటూనే ఉ న్నారు. తిరుపతిలోని శ్రీకృష్ణనగర్లోని ఓ ఇంట్లో వాటర్ ట్యాంక్ పైకి వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో స్థానికులు బెంబేలె త్తిపోయారు. ఎప్పుడు ఏ జరగుతుం దో తెలియక ఆందోళన చెందుతున్నా రు. ఇంకా జనం ఈ ఘటన నుంచి తేరుకోకముందే మరో ఊహించని పరిణామం ఎదురైంది. శ్రీకృష్ణనగర్లో వాటర్ ట్యాంక్ పైకి వచ్చిన ఇంటికి సమీపంలోని ఇంట్లో భూమి కుంగిం ది.కొన్ని ఇళ్లలో మెట్లు రెండు అడు గులు భూమిలోకి వెళ్లాయి అలాగే గోడల కింద భూమి కూడా కిందకు దిగింది. ఇంట్లో టైల్స్ కూడా పగిలి పోతున్నాయి.ఇలా దాదాపు 20 ఇళ్ల లో గోడలు బీటలువారడంతో పాటు అక్కడక్కడా కుంగాయి. దీంతో ఎప్పు డు ఏం జరుగుతుందోనని జనం ఆందోళన చెందుతున్నారు.

# అర్ధరాత్రి నుంచి వానలు పడే అవకాశం

చెన్నై, నవంబర్ 27, (న్యూస్ పల్స్)చెన్నైలో వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో దక్షిణ భారతం పలు ప్రాంతాల్లో పరిస్థితి అధ్వానంగా మారింది. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శుక్రవారం చెన్నై సహా తమిళనాడు తీరప్రాంతాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఇది కాకుండా, రాబోయే రెండు రోజుల పాటు ఇక్కడ పరిస్థితి ఇలాగే ఉ ంటుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. వాయుగుండం ప్రభావంతో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో శనివారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నైలోని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రాంతీయ కార్యాలయం తెలిపింది. ఈ వాయుగుండం సోమవారం నాటికి అల్పపీడనంగా ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ అధికారులు వెల్లడించారు.ప్రాంతీయ వాతావరణ కేంద్రం (ఖీఓఅ) చీఫ్ ఎస్. రానున్న 24 గంటల్లో చెన్నైతోపాటు పరిసర జిల్లాల్లో వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని బాలచంద్రన్ తెలిపారు. రానున్న 48 గంటల్లో చెన్నైలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. సముద్ర మట్టానికి 1.5 కి.మీ ఎత్తులో తుఫాను సర్క్యులేషన్ విస్తరిస్తున్నందున కొమోరిన్ మరియు శ్రీలంకను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని ఎఓఆ తెలిపింది. నవంబర్ 29న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఆ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని అన్ని కోస్తా జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఐఎండీ రెడ్ అలర్ట్ ప్రకటించింది. పక్కనే ఉన్న జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. నవంబర్ 29వతేదీ వరకు తమిళనాడులోని తూత్తుకుడి, కడలూరు, విల్లుపురం, చెంగల్పట్టు, చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, తేని, మధురై, పుదుకోట్టై, పుదుచ్చేరిలో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ శనివారం విడుదల చేసిన తాజా వెదర్ బులెటిన్‌లో తెలిపింది.ఎఓఆ డేటా ప్రకారం, నవంబర్ 25 న చెన్నైలో సగటున 55 మిమీ వర్షం కురిసింది. నవంబర్ 26 సాయంత్రం 4.30 గంటల వరకు 32.5 మిమీ వర్షం కురిసింది. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (ఉఅఅ) వర్షపు నీటిని తొలగించేందుకు నగరం అంతటా 750 కంటే ఎక్కువ హెవీ డ్యూటీ పంపులను నిర్వహిస్తోంది. ఉఅఅ కమిషనర్ గగన్‌దీప్ సింగ్ బేడీ మాట్లాడుతూ.. “చెన్నైలో నిరంతర వర్షం కురుస్తోంది, కాబట్టి మేము మా ప్రస్తుత పంపింగ్ నెట్‌వర్క్ మౌలిక సదుపాయాలను కూల్చివేయలేదు.” 100 మిల్లీమీటర్ల వర్షం కురుస్తుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. నీటి ఎద్దడిని తక్షణమే తొలగించేందుకు పంప్ ఆపరేటర్లందరూ మోటార్ల దగ్గర విధులు నిర్వహించాలని జీసీసీ ఆదేశించినట్లు బేడీ తెలిపారు. వెస్ట్ మాంబలం నుండి నీటిని మళ్లించడానికి ఉపయోగించే టూ వీలర్ సబ్‌వే మినహా అన్ని ఫోర్ వీలర్ సబ్‌వేలు రంగరాజపురంలో పనిచేస్తున్నాయని ఆయన చెప్పారు. పులియంతోప్ సహా చెన్నైలోని వరద ప్రభావిత ప్రాంతాలను బేడీతో కలిసి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పరిశీలించారు. నవంబర్ మొదటి వారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలు నగరవాసులను అతలాకుతలం చేస్తున్నాయి. ఎఓఆ ప్రకారం, అక్టోబర్ 1 నుండి నవంబర్ 25 వరకు ఈశాన్య రుతుపవనాల సమయంలో, చెన్నై దాని పరిసర జిల్లాలైన తిరువళ్లూరు, కాంచీపురం మరియు చెంగల్పట్టులో వరుసగా 56 శాతం నుంచి 67 శాతం వర్షపాతం నమోదైంది.

# అప్పులపై నియంత్రణ లోపించింది

రాజమండ్రి అసెంబ్లీలో ప్రతిపక్షం లేకపోతే ప్రజాస్వామ్యం లేనట్టేనని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. ఏపీ అసెంబ్లీ ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు, తాజా రాజకీయ పరిణామాలపై ఉండవల్లి అరుణ్ కుమార్ రాజమండ్రిలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి అప్పులపై నియంత్రణ లోపించిందని అన్నారు. సీఎం జగన్ ప్రభుత్వ పాలనలో ఘోరంగా వైఫల్యం చెందిందని ఆయన అన్నారు. ఏపీ 6 లక్షల 22 వేల కోట్లు అప్పుల్లో ఉంది.. రెండేళ్లలో వైసీపీ ప్రభుత్వం 3 లక్షల కోట్లకుపైగా అప్పులు చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం అప్పులు తగ్గించి ఆధాయం పెంచుకునే మార్గాలు అన్వేషించాలని హితవు పలికారు. ఎన్టీఆర్ కుమార్తెల గురించి నేనెప్పుడూ ఎలాంటి పుకార్లు వినలేదని ఉండవల్లి అన్నారు. పురందేశ్వరితో, హరికృష్ణతో పరిచయం ఉందని.. వాళ్లిద్దరు చాలా మంచివాళ్లు అని చెప్పుకొచ్చారు. ఎప్పుడు ఎక్కడ ఎవరూ చెడుగా మాట్లాడలేదని అన్నారు. చంద్రబాబు నాయుడు కన్నీరు పెట్టుకోవడం డ్రామా అని తాను అనుకోనని చెప్పారు.అలాంటి మాటలు మాట్లాడేవారు మానసికంగా దెబ్బతిన్నవారని విమర్శించారు. అందులో ఎలాంటి వాస్తవం లేదని ప్రజలకు తెలుసుని అన్నారు. ఒక మంత్రి చంద్రబాబును.. ఓరేయ్, వాడు, వీడు అని సంబోధిస్తాడని.. అది అతడి తప్పు కాదని అన్నారు. అలా మాట్లాడినప్పుడు సీఎం వైఎస్ జగన్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో జగన్ పాద్ర ఉందనిని అంటే తాను నమ్మనని అన్నారు. ఏపీలో అధికార, ప్రతిపక్షాలు బాధ్యతగా పనిచేయడం లేదని విమర్శించారు. టీడీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకపోవడం మంచిది కాదన్నారు. మూడు రాజధానుల బిల్లు ఉపసంహరించుకొని.. మళ్లీ పెడతామని చెప్పడం ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. బిల్లు కూడా సరిగా తయారు చేయకడం అనడం తప్పకుండా వైఫల్యమే అని అన్నారు. మూడు రాజధానుల బిల్లు తేడా వచ్చిందని ముఖ్యమంత్రి చెప్పటం బాధ్యతారాహిత్యమని వ్యాఖ్యానించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా మూడు రాజధానులు తెరపైకి తీసుకొచ్చారని విమర్శించారు. ప్రతిపక్షం సలహాలు తీసుకుంటే ప్రభుత్వానికి పేరు వస్తుందని అన్నారు.

# భారీ వర్షాలను ఎదుర్కొనేందుకు..ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్లాలి

కడప, నవంబర్ 27 జవాద్ తుఫాన్ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. రానున్న తుఫాను, భారీవర్షాలు సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు.. ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని జిల్లా వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజు అధికారులను ఆదేశించారు. రానున్న తుఫాను, భారీ వర్షాలు, ముందస్తు ఏర్పాట్లపై సన్నద్ధత తదితర అంశాలపై.. శనివారం జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజు.. టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో జిల్లా ఎస్పీ అంబురాజన్, జేసిలు ఎం.గౌతమి (రెవెన్యూ), సాయికాంత్ వర్మ (అభివృద్ధి), ధ్యానచంద్ర (హౌసింగ్), రాజంపేట సబ్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్వో మాలోల, కడప, జమ్మలమడుగు ఆర్డీవోలు ధర్మచంద్రారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మరో తుఫాను ప్రభావంతో.. రాయలసీమకు భారీ వర్ష సూచనలు అందుతున్న నేపత్యంలో జిల్లా యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. భారీ వర్షాలు, వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని చెరువులు, కాలువలు, రిజర్వాయర్లు పూర్థి స్థాయి నీటిమట్టంతో ఉ

**అన్ని చెరువులు, కాలువలపై 24/7 నిఘా ఉంచాలి**

**టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించిన జిల్లా ఇంచార్జి కలెక్టర్ వి. విజయరామరాజు**

న్నాయన్నారు. వీటిపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఏమరుపాటు లేకుండా 24 గంటలూ.. ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలన్నారు. రిజర్వాయర్లపై ఇప్పటికే ప్రత్యేక పర్యవేక్షణ సాగుతోందని.. ప్రస్తుతం ఆయా మండలాల్లోని చెరువుల పర్యవేక్షణను సంబందిత ఇరిగేషన్ శాఖ ఏఈలు, డిఈలు బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. అలాగే ప్రతీ రెండు గంటలకు ఒకసారి నీటి మట్టంను నమోదు చేయించి.. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. అంతేకాక గ్రామ, వార్డు కార్యదర్శుల (పురుషులు) తో వాచ్ ఉ వార్డ్ విధులను నిర్వర్తించేలా ఆదేశాలు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వాలంటీర్లు చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన ఇసుక బ్యాగ్స్ ను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అలాగే.. గంటగంటకు.. వర్షపాతం నమోదు చేసి వివరాలను అందచేయాలన్నారు.

# 27వ రోజు రైతుల పాదయాత్ర...

నెల్లూరు 27వ రోజు నెల్లూరు పట్టణంలోని జెట్టి శేషరెడ్డి ఫంక్షన్ హాల్ నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. అంబాపురంలోని శాలివాహన ఫంక్షన్ హాల్ వరకూ 12కిలోమీటర్ల మేర ఈ పాదయాత్ర సాగింది. ఒక రాష్ట్రం-ఒకే రాజధాని అంటూ అమరావతి రైతులు 27వరోజు పాదయాత్ర కొనసాగిస్తున్నారు. నెల్లూరులో రాత్రి బసచేసిన జెట్టి శేషరెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద వెంకటేశ్వర స్వామికి పూజలు చేసిన తర్వాత.. ఈరోజు పాదయాత్ర ప్రారంభించారు. అంబాపురంలోని శాలివాహన ఫంక్షన్ హాల్ వరకూ ఇవాళ 12 కిలోమీటర్ల మేర నడవనున్నారు. జగన్ ఇచ్చే మంత్రి పదవులకు ఆశపడి.. తమను అవమానించొద్దని.. మహిళలు వైకాపా ఎమ్మెల్యేలకు సూచించారు. దారి పొడవునా వివిధ వర్గాలు, సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. నెల్లూరు చేనేత సమాఖ్య ప్రతినిధులు మహిళలతో కలిసి నడిచారు. నేతన్నలు పాదయాత్ర చేస్తున్న మహిళలకు చీరలు పెట్టారు. కోవూరు ప్రాంతంలోని వరద ముంపు ప్రాంతాల మీదుగా వెళ్తున్న రైతులు..ఆ చీరల్ని అక్కడ నిరాశ్రయులకు పంచిపెట్టి మానవత్వం చాటారు. సాధారణంగా ఒక పార్టీ అనుచరులు కదిలితే ప్రత్యర్థి పక్షాలు ఆ కార్యక్రమానికి దూరంగా ఉంటారు. రైతుల పాదయాత్రలో అవేమీ కనిపించలేదు. వైకాపా మినహా అన్ని పార్టీల నేతలూ యాత్రలో స్వచ్ఛందంగాపాల్గొంటున్నారు విరాళాలు అందజేయడంలోనూ ఇదే ఉత్సాహం కనబర్చారు. మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులరెడ్డి... రైతులకు రెండు రోజులపాటు వసతి, ఆహారం అందజేయడంతో పాటు రూ.2లక్షల విరాళం అందజేశారు. అదే గ్రామానికి పెల్లకూరు శ్రీనివాసులరెడ్డి రూ.2లక్షల అందజేశారు. ఉదయగిరి సమీపంలోని కమ్మవారిపాళెం గ్రామస్థులు 32వేలు, నెల్లూరులో కె.పెంచలనాయుడు మిత్రమండలి రూ. 60వేలు, మాధవరావు మిత్ర బృందం రూ. 20వేలు విరాళం అందించింది.

# లారీ, కారు ఢీ?ఇద్దరు మృతి

అనంతపురం చెన్నేకొత్తపల్లి మండల పరిధిలోని నాగ సముద్రం గేట్ వద్ద గల జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బెంగళూరు వైపు వెళ్తూ ఓవర్ టేక్ చేస్తున్న సమయం లారీని వెనుక వైపు నుంచి కారు ఢీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడిక్కడే మృతి చెందారు. మరో ముగ్గరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హాస్పిటల్కు తరలించారు. మృతులు మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు.

# మానవత్వం చాటుకున్న నందమూరి అభిమాని విజయ్

**యువత మానవతా దృక్పథం అలవాటు చేసుకోవాలి**

కొతాళం యువత ,ప్రతి ఒక్కరూ మానవ దృక్పథం అలవాటు చేసుకోవాలని మానవ సేవకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని తోవి గ్రామానికి కి చెందిన నందమూరి వీరాభిమాని పలు సినిమాల్లో డాన్సర్ గా గ్రామాల్లో డ్యాన్స్ మాస్టర్ గా పెరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న విజయ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం హైదరాబాదులో అఖండ సినిమా మూవీ సందర్భంగా బసవతారకం హాస్పిటల్ లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరం లో ఎన్.బి.కె హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో తొమ్మిదవ సారి రక్తదానం చేసి అభిమానాన్ని మానవత్వాన్ని చాటుకున్నారు. వారు మాట్లాడుతూ అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదని రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నందమూరి బాలకృష్ణ సతీమణి వారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

## వైకాపా రాజకీయ నిరుద్యోగుల కోసమే శాసనమండలి రద్దు విషయంలో వెనక్కి తగ్గిన జగన్

**నవతరంపార్టీ**

నరసరావుపేట వైకాపా రాజకీయ నిరుద్యోగులకు నిలయంగా శాసనమండలిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నింపేసారని నవతరంపార్టీ జాతీయ అధ్యక్షుడు రావుసుబ్రహ్మణ్యం అన్నారు.గతంలో తెలుగుదేశం పార్టీ,బీజేపీ, ఇతరుల బలం ఉన్న సమయంలో 3 రాజధానులు బిల్లు ఆమోదించడానికి శాసనమండలి తిరస్కరించిన నేపద్యంలో శాసనమండలి రద్దు కు తీర్మానాన్ని చేసిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రస్తుతం వైస్సార్సీపీ సభ్యుల బలం పెరగడంతో శాసనమండలి రద్దు తీర్మానం వెనక్కి తీసుకొంటూ సభలో ప్రకటన చేయడం వారి ద్వంద్వ వైఖరిని స్పష్టం చేస్తోందని రావుసుబ్రహ్మణ్యం అన్నారు.శాసనమండలి రద్దుకు కట్టుబడి వుండాలని, ధైర్యం ఉంటే శాసనమండలి రద్దు చేయాలని నవతరంపార్టీ డిమాండ్ చేస్తోంది అన్నారు.రాజధాని అమరావతి కి వ్యతిరేకంగా చేసిన బిల్లును రద్దు చేసిన విషయంలో మరలా మడమతిప్పే ప్రోగ్రాంలకు స్వస్తి పలికి అమరావతిలో రాజధాని కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.నరసరావుపేటలో నవతరంపార్టీ పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ గోదా రమేష్ కుమార్ తో కలసి శనివారంవిలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక హోదా గురించి పాలక పక్షం, ప్రతిపక్ష పార్టీలు పోరాడాలని,ఇక రాజధాని అమరావతి పై జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దృష్టి సారించి ముందుకు వెళ్లాలని డాక్టర్ గోదా రమేష్ కుమార్ డిమాండ్ చేశారు.

# పార్వతీపురంలో బీజేపీ విరాళాల సేకరణ

విజయనగరం విజయనగరం జిల్లా పార్వతీపురం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరణ జరిగింది. గత రెండు రోజుల గా ద్వారపురెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 70,000 నగదు సేకరణ జరిగింది. స్వచ్ఛందంగా తాము కూడా కొంత మొత్తాన్ని కలిపి పార్టీ కి అందజేస్తామని తెలిపారు.

# ప్లైవుడ్ దుకాణంలోఅగ్ని ప్రమాదం

నెల్లూరు నెల్లూరు నగరంలోని సంతపేట సప్తగిరి ప్లే ఉడ్స్ లో శనివారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. గోడౌన్ లో మంటలు రావడంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు స్పందించి ఫైర్ ఇంజన్ ను పంపడంతో మంటలను అదుపు చేసే ప్రయత్నం ప్రారంభించారు. అగ్నిమాపక శాఖ స్టేషన్ ఫైర్ అధికారి శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. పూర్తిస్థాయిలో మంటలను అదుపు చేశారు. సుమారు 5 లక్షల వరకు నష్టం సంభవించిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

# రోడ్లు వేయడం చేతకాని ప్రభుత్వం మూడు రాజధానులు కడతాతుందా–టీడీపీ




గోనెగండ్ల:నవంబర్ 27,( విభారె) మండల కేంద్రమైన నవంబర్ 27 శనివారం టిడిపి కార్యాలయం నందు కార్యకర్తల సమావేశం రాష్ట్రంలో అర్ అండ్ బీ రోడ్లు గుంతలు పూడ్చడం చేతకాని ప్రభుత్వం మూడు రాజధానులు కడతాం అని రెండున్నారేళ్లు ప్రజల్ని మోసం చేశారని తెలుగు యువత మండల అధ్యక్షుడు రంగస్వామినాయుడు,టిఎన్ఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు మాదిగ నాగరాజు,గాజులదీన్నే ప్రభాకర్ నాయుడు,టీఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు రమేష్ నాయుడు,మండల తెలుగు యువత సహాయ కార్యదర్శి అబూబకార్,నాగేష్,వార్డు మెంబర్లు జిలానీ బాషా,పూజరీ రంగస్వామి ఆరోపించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి అరాచక పాలనా ఎక్కువవుతుందని ప్రజలు దిన్నంటినీ గమనిస్తున్నారని అన్నారు.రాష్ట్రంలో టీడీపీ హయాంలో వేసినా అర్ అండ్ బి రోడ్లు తప్ప,ఆవే రోడ్లు ఇప్పుడు గుంతలు ఏర్పడిన పూడ్చడం లేదా కొత్తవి వేయడం ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదని అన్నారు.రాష్టాన్ని మరో బీహార్ గా తయారు చేసేందుకు వైసీపీ ప్రభుత్వం కంకణం కట్టుకున్నాదని అన్నారు.సామాన్య ప్రజలకు అందుబాటులోకి ఇసుకను తేలేక వైసీపీ నాయకుల కబంధ హస్తాల్లోకి ప్రభుత్వం తీసుకువెళ్లిందని అన్నారు.ఇసుక దొరక్క భవనా నిర్మాణ కార్మికులకు పనులు లేక ఇతర రంగాల వారికి కూడా ఉపాధి లేక వారి కుటుంబాల జీవితాలు ధీనవస్థ స్థితికి ఈ ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు.వైసీపీ ప్రభుత్వం రాగానే ప్రతీ జనవరిలో ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు ఉపాది కల్పిస్తాం అని చెప్పి మాట తప్పిన ప్రభుత్వంగా నిలిచిందని నిరుద్యోగులను మోసం చేసిందన్నారు.టీడీపీ హయాంలో నిరుద్యోగ భృతి,అన్నా క్యాంటీన్లు,నిరుపేదలకు పెళ్లికానుకలు,సంక్రాంతి కానుకలు,క్రిష్మస్ కానుకలు,రంజాన్ తోఫాలు,గతంలో మంజూరు అయినా ఎన్టీఆర్ గృహాలను సైతం రద్దు చేసినా గొప్ప ప్రభుత్వంగా ఈ వైసీపీ ప్రభుత్వం నిలిచిందని అన్నారు.వైసీపీ ప్రభుత్వం వచ్చి ఈ 2న్నారా ఏళ్ళల్లో 3 లక్షల కోట్లు అప్పు చేసిందంటే ఇంకా 2న్నార ఏళ్ళల్లో ఇంకా ఎంత అప్పు చేసి ప్రజలపై భారం మోపుతారని అని ప్రశ్నించారు.జగన్ ముఖ్యమంత్రి అయినా తర్వాత రాష్ట్రంలో ఎక్కడైనా ఒక్క ఇటుక వేసి ఒక్కటైన ప్రభుత్వ భవనం నిర్మించారా అని ప్రశ్నించారు.అమ్మఒడి కూడా ఇప్పుడూ 75 శాతం ఉంటే విద్యార్థులకు వర్తిస్తుందని ప్రభుత్వం షరతులు పెడుతుందని ఎద్దేవా చేశారు.రాష్ట్రాన్ని తొందర్లోనే అప్పుల ఆంద్రప్రదేశ్ గా మారుస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో గోవర్ధన్ నాయుడు,దావీదు,ఎన్వీ బాలక్రిష్ణ,అల్వాల ఖాసీం,రవికుమార్,గంజల్లా అశోక్,కున్నూరు రాజేష్,ఆహోబిలం,నాగరాజు,బడేసవాలి,రఫిక్,బాషా తదితరులు పాల్గొన్నారు

# నందికొట్కూరు లో సీఎం కప్ పోటీలు ప్రారంభం



నందికొట్కూరు. నవంబర్27( విభారె) .నందికొట్కూరు మున్సిపాలిటీ లోని గాంధీ మెమోరియల్ జడ్పీ పాఠశాల ప్రాంగణంలో శనివారం ఏపీ సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీలను నందికొట్కూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి వేణు గోపాల్, మున్సిపల్ చైర్మన్ దాశీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంకిరెడ్డి, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం శర్మ, లు ప్రారంభించారు. అనంతరం వారు క్రీడా వందనం స్వీకరించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు మానసిక శారీరక దృఢత్వం బలోపేతం కావాలంటే ఆటలు కూడా ఉండాలంటూ వాటి ప్రాముఖ్యతను గుర్తించి ప్రియతమ నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ పోటీలను ప్రారంభించారని మున్సిపల్ చైర్మన్ దాశీ సుధాకర్ రెడ్డి అన్నారు.మండల స్థాయి లో ప్రతిభ చూపి ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో పాల్గొని అక్కడి నుండి జిల్లా,మరియు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఫైజున్నిసా బేగం, 10వ వార్డు కౌన్సిలర్ వీరబొమ్మ రూపాదేవి , లాలు ప్రసాద్ , వ్యాయామ ఉపాధ్యాయులు పెరుమాళ్ళ శ్రీనాథ్ , వీరన్న , దోరతి క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీ బిందెలు తో నిరసనకు దిగిన గ్రామస్తులు

అర్ధవీడు నవంబర్27( విభారె) ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం మాగుటూరు గ్రామంలోని కృష్ణానగర్ ప్రజలు రోడ్డెక్కారు. తమ గ్రామంలో నాలుగు రోజుల నుంచి కరెంటు లేదని పది రోజుల నుంచి మంచి నీరు రావడం లేదంటూ నిరసనకు దిగారు. కంభం నుండి అర్ధవీడు వెళ్తున్న ఆర్టీసీ బస్సులు అడ్డగించి రాస్తారోకో చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది.సమాచారం అందుకున్న పంచాయతీ సెక్రటరీ, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని సముదాయించేందుకు ప్రయత్నించారు. ఆగ్రహంతో ఉన్న గ్రామ ప్రజలు పంచాయతీ కార్యదర్శితో వాగ్వివాదానికి దిగారు. సాధ్యమైనంత త్వరగా




సమస్య పరిష్కరిస్తామని సంబంధిత అధికారులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు నిరసన విరమించారు.

# నష్టపోయిన ఉల్లి పంట మరియు పప్పు శనగ పంట రైతులను పరామర్శించిన..

## .నియోజకవర్గ ఇంచార్జ్ గౌ.శ్రీ.కే.ఈ.శ్యామ్ కుమార్

పత్తికొండ నవంబర్ 27,( విభారె): పత్తికొండ నియోజకవర్గ ఇంచార్జ్ గౌ.శ్రీ.కే.ఈ.శ్యామ్ కుమార్ గారు పత్తికొండ తాలూక హోసూరు గ్రామంలో తుఫాను వల్ల నష్టపోయిన ఉల్లి పంట మరియు పప్పుశనగ పంట రైతులను పరామర్శించారు అనంతరం నష్ట పోయిన రైతులతో మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకొని ఏప్పుడైయితే రైతుభరోస 12500 ఇస్తామన్ని చెప్పి ప్రభుత్వం లోకి వచ్చిన వెంటనే కేంద్ర ఇస్తున్న వాటితో కలిపి ఇస్తాము.అన్నప్పుడే తెలిసిపోయింది మీకు రైతులపై ఏంత చిత్తసుద్ధి వుందని. అన్నదాతలు పంటలు నష్టపోయి సర్వం కోల్పోయి ఆత్మహత్య లు చేసుకుంటుటే,ముఖ్యమంత్రి ,మంత్రులు,అసెంబ్లీలో వ్యక్తిగత విమర్శలు చేయడం,వరదల వల్ల నష్టపోయిన పరిస్థితి రాష్ట్రంలో ప్రజల కు తెలియకుండా దృష్టి మల్లించడం ఇవన్నీ చేస్తున్నారు.కాని ప్రజలు అన్ని గమనిస్తున్నారు మీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దెగ్గర పడింది అని అన్నారు. అనంతరం హోసూరు నుండి మెలగవెల్లి వెళ్లే రహదారి ని పరిశీలించడం జరిగింది. మా ప్రభుత్వం లో ఈ రోడ్డు వేయడానికి ఊ తో పాటు 3కోట్ల 70 లక్షలతో షాక్షన్ చేయంచి పనికూడ మెదలు పెట్టడం జరిగింది.మరి మీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఏమి చేశారు అంటే రివర్స్ టెండరింగ్ అని వున్న వాటిని పనులు జరగకుండా ఆపివేయడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమలో మండల కన్వీనర్ లోకనాథ్, హోసూరు మాజి సర్పంచ్ శ్రీనివాస్,ఓఖుఅ బాబాఫకృద్దీన్,నాసెల్ నాయకులు సోమ్లనాయక్,హోసూరు గ్రామ అధ్యక్షుడు రాఘవేంద్ర,సంజప్ప,క్రిష్టన్న, నరసింహులు,రామాంజినేయులు,శ్రీనివాస్ గౌడ్, హరి,సోమప్ప,ఉప్పర లక్ష్మణ,అంజి,నాగార్జున, మద్దికెర మండల నాయకులు ధనుంజయుడు,ఆవుల పెద్దన్న,తెలుగు యువత,ఎబొఈ నాయకులు బోయ కేశవ,రాజశేఖర్,సాయి,అశోకు,సోమశేఖర్,పవన్ మరియు రైతులు,హోసూరు గ్రామస్తులు, కార్యకర్తలు,యువత,పాల్గొన్నారు.

# వివాహ మహోత్సవ కార్యక్రమం లో బూచేపల్లి

దర్శి నవంబర్ 27,( విభారె) -ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం తాళ్లూరు మండలం తూర్పు గంగవరం గ్రామం లో గుజ్జుల యోగిరెడ్డి కుమారుని వివాహ మహోత్సవ కార్యక్రమం లో శనివారం ప్రకాశం జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ మరియు దర్శి మాజీ శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పాల్గొని నూతన దంపతులు ను ఆశీర్వాదించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా బూచేపల్లి కుటుంబ సభ్యులు కు ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమం లో తాళ్లూరు మండలం వైసీపీ నాయకులు, బూచేపల్లి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.




# వివాహ మహోత్సవం లో పాల్గొన్న పమిడి, నారపశెట్టి

దర్శి నవంబర్ 27,( విభారె)-ప్రకాశం జిల్లా దర్శి పట్టణం కు చెందిన టీడీపీ నాయకులు శింగంశెట్టి నాగేశ్వరావు, విజయకుమారి ల కుమారుడు అశోక్ కుమార్ వివాహ కార్యక్రమం లో దర్శి నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి పమిడి రమేష్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వాదించి నూతన బట్టలు బహుమతి ప్రధానం చేసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా రమేష్ కు ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమం లో దర్శి మాజీ శాసనసభ్యులు నారపశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, శోభారాణి, టీడీపీ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

---

# మెగా ఆచార్య ఓటీటీ అప్డేట్




మెగాస్టార్ చిరంజీవి.. కొరటాల శివ ల కాంబోలో రూపొందిన ఆచార్య సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఇతర భారీ సినిమాలు వరుసగా విడుదలకు సిద్దంగా ఉన్న కారణంగా ఆచార్య ను వచ్చే ఏడాది ఫిబ్రవరిలో విడుదల చేయబోతున్నట్లు ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్న నేపథ్యంలో అన్ని ఏరియాల్లో కూడా పెద్ద ఎత్తున బిజినెస్ ఉన్నట్లుగా తెలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవి అంటే సాధారణంగా అంచనాలు మామూలుగా ఉండవు అలాంటిది ఈ సినిమాలో రామ్ చరణ్ కీలక పాత్రలో నటించాడు.తండ్రీ కొడుకులు కలిసి నటించిన సినిమా అవ్వడం వల్ల అన్ని ఏరియాల్లో కూడా ఈ సినిమా రికార్డు స్థాయి వసూళ్లు దక్కించుకోవడం ఖాయం అంటూ ట్రేడ్ విశ్లేషకులు నమ్మకంగా ఉన్నారు. అన్ని ఏరియాల్లో కూడా ఈ సినిమా భారీ మొత్తాలకు అమ్ముడు పోతున్నట్లుగా తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాలతోపాటు ఓవర్సీస్ లో ఇంకా ఇతర ఏరియాల్లో కూడా ఆచార్య సినిమా మంచి బిజినెస్ ను చేస్తుందట. సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుందనే నమ్మకం ఉన్నది కనుక బయ్యర్లు భారీ మొత్తానికి కొనుగోలు చేస్తున్నారని తెలుస్తోంది. తాజాగా ఈ సినిమాను అమెజాన్ ప్రైమ్ వారు ఓటీటీ స్ట్రీమింగ్ కోసం కొనుగోలు చేయడం జరిగింది.పోస్ట్ స్ట్రీమింగ్ కు గాను ఆచార్య కు భారీ మొత్తంలో అమెజాన్ వారు కట్టబెట్టారని మీడియా వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. చిరంజీవి మరియు రాంచరణ్ ల సినిమా అవడం వల్ల బాలీవుడ్ సినిమాల రేంజ్ లో ఈ సినిమాకు రేటు పలికిందంటున్నారు. కేవలం అమెజాన్ మాత్రమే కాకుండా ఇంకా పలు ప్రముఖ ఓటీటీ లు కూడా ఈ సినిమాను కొనుగోలు చేయడం కోసం ప్రయత్నించాయి. కానీ చివరికి నిర్మాతలు అనుకున్న ప్రైస్ అమెజాన్ వారు ఇవ్వడం వల్ల ఆచార్య పోస్ట్ ఓటీటీ స్ట్రీమింగ్ రైట్స్ ను అమెజాన్ వారికి దక్కడం జరిగింది. ఇక ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవికి జోడీగా కాజల్ అగర్వాల్ నటించిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో రామ్ చరణ్ కు జోడిగా కియారా అద్వానీ నటించింది.నక్సలైట్ ఉద్యమం తో పాటు ఒక ఆసక్తికర కథను దేవాలయాల నేపథ్యంలో చూపించడంలో దర్శకుడు కొరటాల శివ సఫలం అయ్యాడని చిత్ర యూనిట్ సభ్యులు చాలా నమ్మకంగా చెబుతున్నారు. ఇప్పటివరకు అపజయం అంటూ ఎరుగని కొరటాల శివ ఈ సినిమాని తెరకెక్కించడం వల్ల కూడా సినిమాకు భారీ బజ్ క్రియేట్ అయింది. కేవలం వంద రోజుల్లో సినిమా చేస్తాం అంటూ ప్రకటించిన కొరటాల శివకు కరోనా అడ్డు రావడంతో చాలా ఆలస్యమైంది.గత ఏడాది విడుదల కావాల్సిన ఈ సినిమా వచ్చే ఏడాది వరకు వేచి చూడాల్సి వచ్చింది. మెగా స్టార్ అభిమానులకు ఫుల్ మీల్స్ లాంటి సినిమా ఇది అని.. మాస్ మసాలా ఎలిమెంట్స్ ను భారీగా అందిస్తుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు అంటున్నారు. అలాగే మెగా అభిమానులు ఎప్పటికీ గుర్తుంచుకునేలా చిరంజీవి మరియు రామ్ చరణ్ సినిమా ఉంటుందని కూడా అభిమానులు నమ్మకంతో ఎదురుచూస్తున్నారు.

# ఈ యంగ్ హీరో కొత్త జర్నీ ప్లాన్

ప్రపంచ వ్యాప్తంగా ఓటీటీ ల ఆదరణ అనూహ్యంగా పెరిగింది. విదేశాల్లో ఓటీటీలకు ఇంతకు ముందే ఆదరణ ఉన్నప్పటికీ ఇండియాలో మాత్రం ఈ మధ్య కాలంలో ముఖ్యంగా కరోనా సమయంలో అత్యధికంగా ఆధరణ పెరిగింది. కరోనా సమయంలో తెలుగు తో పాటు ఇతర ఇండియన్ భాషల సినీ ప్రేక్షకులకు ఓటీటీ లే ఆధారం అయ్యాయి.ఓటీటీ లో పెద్ద ఎత్తున సినిమాలను మరియు వెబ్ సిరీస్ లను నిర్మించేందుకు గాను ప్రముఖ దర్శక నిర్మాతలు ముందుకు వస్తున్నారు. ఇంతకు ముందు ఓటీటీ కంటెంట్ అంటే పెద్దగా ఇంట్రెస్ట్ చూపించని హీరోలు కూడా ఇప్పుడు ఓటీటీ కంటెంట్ కు క్యూ కడుతున్నారు. వెబ్ సిరీస్ లు మరియు వెబ్ మూవీస్ కోసం వందల కోట్లు ఖర్చు చేస్తున్న దాఖలాలు ఉన్నాయి.పెరిగిన ఓటీటీ ఆధరణ నేపథ్యంలో పలువురు స్టార్స్ కూడా ఓటీటీ ఎంట్రీకి సిద్ధమవుతున్నారు. బాలీవుడ్లో ఇప్పటికే పలువురు స్టార్ హీరోలు మరియు దర్శకులు కూడా ఓటీటీ కంటెంట్ కు రెడీ అయిపోయిన విషయం తెలిసిందే. టాలీవుడ్ నుండి కూడా కొందరు హీరో ఇప్పటికే ఓటీటీ కంటెంట్ లో నటించేందుకు సిద్ధమయ్యారు.వెంకటేష్.. రానా మరియు నాగచైతన్య ఓటీటీ ప్రాజెక్ట్ ల్లో నటిస్తున్నారు. వారి ప్రాజెక్టులు వచ్చే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. ఇదే సమయంలో యంగ్ హీరో నితిన్ కూడా ఓటీటీ వైపు అడుగులు వేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం అందుతోంది. ఇటీవల ఈయన నటించిన మ్యాస్ట్రో సినిమా ఓటీటీ లో విడుదలైన విషయం తెలిసిందే.ఆ సినిమా తో నిర్మాతగా కూడా మంచి సక్సెస్ ను నితిన్ దక్కించుకున్నాడు. అందుకే నితిన్ వరుసగా ఓటీటీ కంటెంట్ చేయాలనే ఉద్దేశం కు వచ్చినట్లుగా ఆయన సన్నిహితుల ద్వారా తెలుస్తోంది. ఇప్పటికే ఆయన ఓటీటీ కంటెంట్ కోసం రచయితలతో మరియు దర్శకులతో సంప్రదింపులు జరుపుతున్నారు.కొత్త కథలు విభిన్నంగా ఉన్న కథలు ఆయన ఎంపిక చేసుకున్నట్లుగా తెలుస్తోంది. వెబ్ సిరీస్ మరియు వెబ్ మూవీస్ ను సొంత నిర్మాణ సంస్థ లోనే కాకుండా ఇతర నిర్మాణ సంస్థల్లో కూడా చేసేందుకు నితిన్ ఆసక్తి చూపిస్తున్నాడని మీడియా వర్గాల ద్వారా సమాచారం అందుతోంది.ఇప్పటి వరకు నితిన్ ఓటీటీకి సంబంధించి అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. నితిన్ సినిమాల విషయానికొస్తే మాచర్ల నియోజక వర్గం అనే సినిమాను ఇప్పుడు చేస్తున్నాడు. ఆ సినిమా వచ్చే ఏడాదికి విడుదలయ్యే అవకాశం ఉంది.



# మహేష్ బాబు మరో కొత్త వ్యాపారం..?

సినిమా హీరోహీరోయిన్లు చాలామంది కేవలం నటనకే పరిమితం కాకుండా సపోర్ట్ గా మరికొన్ని ఇతర వ్యాపారాల్లో పెట్టుబడులు పెడుతూ రెండు చేతులా సంపాదిస్తూ ముందుకు వెళ్తున్నారు. ఎవరైనా సరే క్రేజ్ ఉన్నప్పుడే నాలుగు రాళ్లు వెనకేసుకోవాలని ఆలోచించడంలో తప్పేమీ లేదు. టాలీవుడ్ లో సైడ్ బిజినెస్ లు చేస్తున్న వారిలో సూపర్ స్టార్ మహేష్ బాబు ఒకరు.హీరోగా కెరీర్ పీక్ స్టేజ్ లో ఉన్నప్పుడే బిజినెస్ మ్యాన్ గా ఇతర వ్యాపారాలపై దృష్టి పెట్టారు మహేష్. ది హంబుల్ అనే డిజైనర్ వేర్ ద్వారా మహేష్ టెక్సటైల్ బిజినెస్ లోకి దిగిన సంగతి తెలిసిందే. అలానే ఏషియన్ గ్రూప్ తో కలిసి ఏఎంబీ సినిమాస్ పేరిట థియేటర్స్ మల్టీప్లెక్స్ బిజినెస్ లోకి ఎంటరయ్యాడు. అంతేకాదు జీఎంబీ ఎంటర్టైన్మెంట్స్ పేరుతో నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి మూవీ ప్రొడక్షన్స్ లోకి కూడా దిగారు.మహేష్ నటించే ప్రతి సినిమాలోనూ భాగస్వామిగా వ్యవహరిస్తూ.. తన బ్యానర్ లో ఇతర హీరోలతో కూడా సినిమాలు చేస్తున్నారు. హీరోగానే కాకుండా బిజినెస్ మ్యాన్ గా కూడా సక్సెస్ అయిన మహేష్.. ఇప్పుడు మరో కొత్త వ్యాపారంపై దృష్టి పెడుతున్నారట. బైజూస్ తరహాలో ఒక ఈ-లెర్నింగ్ యాప్ ని తీసుకురావాలని మహేష్ బాబు ఆలోచన చేస్తున్నారని టాక్ వినిపిస్తోంది.ప్రస్తుతం ఆన్ లైన్ చదువులకు బాగా డిమాండ్ పెరిగిందనే సంగతి తెలిసిందే. కరోనా లాక్ డౌన్ టైంలో ఎన్నో ఎడ్యుకేషనల్ యాప్స్ అందుబాటులోకి వచ్చాయి. అలాంటి వాటిలో బైజూస్ వంటి కొన్ని ఈ-లెర్నింగ్ యాప్స్ సక్సెస్ అయ్యాయి. బైజూస్ కు మహేష్ బాబు బ్రాండ్ అంబాసిడర్ గా కూడా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే అలాంటి ఎడ్యుకేషనల్ యాప్ ని తీసుకురావాలని భావిస్తున్నారట.అన్ని తరగతుల విద్యార్థులకు సంబంధించిన స్టడీ మెటీరియల్ తో అందరికి అందుబాటులో ఉండేలా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో పనిచేసే విధంగా ఈ యాప్ ను డిజైన్ చేయాలని చూస్తున్నారట. ప్రస్తుతం ఈ ఎడ్యుకేషనల్ యాప్ కు సంబంధించిన ప్లాన్ రెడీ అవుతోందని టాక్. ఆల్రెడీ సక్సెస్ ఫుల్ బిజినెస్ మ్యాన్ అనిపించుకున్న మహేష్.. కొత్త వ్యాపారంలో అడుగుపెడుతున్నాడనే వార్తల్లో నిజమెంతో తెలియాలంటే ఇంకొన్నాళ్లు ఆగాల్సిందే.ఇక సినిమాల విషయానికొస్తే.. మహేష్ బాబు ప్రస్తుతం 'సర్కారు వారి పాట' అనే కమర్షియల్ ఎంటర్టైనర్ లో నటిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 1న ఈ సినిమా విడుదల కానుంది. దీని తర్వాత త్రివిక్రమ్ శ్రీనివాస్ - రాజమౌళి వంటి అగ్ర దర్శకులతో మహేష్ వర్క్ చేయనున్నారు. ఇక నిర్మాతగా చేస్తున్న 'మేజర్' సినిమా 2022 ఫిబ్రవరి 11న రిలీజ్ అవుతుంది.

# అరె ఇద్దరూ ఒకేసారి పరిగెత్తారు.. ఇద్దరూ ఒకేసారి డైవ్ చేశారు.. ఆఖరికి



ఛాటోగ్రామ్ వేదికగా పాకిస్తాన్- బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో ఓ ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. బంగ్లా ఇన్నింగ్స్‌లో భాగంగా 95 ఓవర్ వేసిన హసన్ అలీ బౌలింగ్‌లో మెహదీ హసన్ కవర్ డ్రైవ్ షాట్ ఆడాడు. అయితే ఫీల్డర్లు ఇమామ్-ఉల్-హక్, అబ్దుల్లా షఫీక్ బంతిని ఆపడానికి ప్రయత్నించారు.ఈ క్రమంలో ఒకేసారి పరిగెత్తడంతో పాటు యాదృచ్ఛికంగా ఒకేసారి డైవ్ కూడా చేశారు. చివరకు బంతిని దొరకబుచ్చుకున్నారు. దీంతో రెండు పరుగులు మాత్రమే వచ్చాయి. కాగా ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఈ వీడియో నెటిజన్లను ఆకట్టుకుంటోంది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 330 పరుగులకు ఆలౌటైందిపాకిస్తాన్ బౌలర్లలో హసన్ అలీ ఐదు వికెట్లు పడగొట్టగా, షహీన్ అఫ్రిది, అష్రఫ్ చెరో రెండు వికెట్లు సాధించారు. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్.. మిడిలార్డర్ మిడిలార్డర్ విఫలం అయినప్పటికీ, లిటన్ దాస్, ముష్ఫికర్ రహీం 206 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేసి గౌరవప్రదమైన స్కోర్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. బంగ్లా బ్యాటర్లలో లిటన్ దాస్ (114),ముష్ఫికర్(91), మెహది హసన్ టాప్ స్కోరర్‌లుగా నిలిచారు.

### వారెవ్వా అక్షర్ పటేల్.. టెస్టు క్రికెట్ చరిత్రలో మూడో బౌలర్‌గా

టీమిండియా లెగ్ స్పిన్నర్ అక్షర్ పటేల్ బౌలింగ్‌లో తన సూపర్ ఫామ్‌ను కంటిన్యూ చేస్తున్నాడు. తాజాగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో అక్షర్ పటేల్ 34 ఓవర్లు వేసి 6 మెయిడెన్లు సహా 62 పరుగులిచ్చి 5 వికెట్లు తీశాడు. టామ్ లాథమ్, రాస్ టేలర్, హెన్రీ నికోలస్, టామ్ బ్లండర్, సౌథీ రూపంలో అక్షర్ 5 వికెట్లు తీసుకున్నాడు. అంతకముందు ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో నాలుగుసార్లు ఐదు వికెట్ల మార్క్‌ను అందుకున్నాడు.? కాగా అక్షర్ టెస్టుల్లో ఒకే ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీయడం ఇది ఐదోసారి. తొలి నాలుగు టెస్టుల్లో ఎక్కువసార్లు ఐదు వికెట్లు తీసిన జాబితాలో టామ్ రిచర్డ్‌సన్, రోడ్నీ హగ్‌తో కలిసి అక్షర్ సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**